RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, ఏప్రిల్ 22, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 17 | పేజీలు: 8 | వెల : రూ.1




**విదేశాల్లో ఇంతేనంటూ... బాయ్ ఫ్రెండ్ కళ్లకు గంతలు కట్టి నిప్పంటించిన యువతి**

- ప్రపోజల్ పేరుతో ప్రియుడిని దారుణంగా హత్య చేసిన యువతి
- బెంగళూరులో జరిగిన ఈ ఘటనలో ప్రేరణ అనే యువతి అరెస్ట్
- కుర్చీకి కట్టేసి, నిప్పంటించి ప్రియుడు కిరణ్ ను సజీవదహనం



## కాళేశ్వరం అక్రమాలపై
# మీరే విచారించండి

- సీబీఐతోనే ఎఫ్ఐఆర్ నమోదు చేయించండి.. సీబీఐకి పంపిన లేఖలో రాష్ట్ర ప్రభుత్వం
- ఆర్నెల్ల తర్వాత స్పందించిన సీబీఐ.. రాష్ట్ర పోలీసులు కేసు పెట్టలేదని స్పష్టీకరణ
- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేయాలన్న విజ్ఞప్తి



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విచారణను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కేసులో సీబీఐనే స్వయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని స్పష్టం చేస్తూ తాజాగా సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాసింది. గత ఏడాది సెప్టెంబరు మొదటి వారంలోనే ఈ అంశంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినా, దాదాపు ఆరు నెలల తర్వాతే కేంద్ర దర్యాప్తు సంస్థ స్పందించింది. ఈ నేపథ్యంలో 'రాష్ట్ర పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారా?' అని సీబీఐ అడగగా, ఇప్పటివరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని రాష్ట్రం స్పష్టం చేసింది. దీంతో సీబీఐనే కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించాలని

(మిగతా 2వ పేజీలో)

## ఘోష్ కమిషన్‌పై హైకోర్టులో నేడే తీర్పు

- కేసీఆర్, హరీశ్‌రావు సహా పలువురి పిటిషన్‌లపై తీర్పు
- మార్చి 12న విచారణ పూర్తిచేసిన ధర్మాసనం
- జీవో 6 చెల్లుబాటుపై రానున్న స్పష్టత



## కాల్పుల విరమణపై
# ట్రంప్ యూటర్న్!

- పాక్ అభ్యర్థనతో గడువు పొడిగింపు నిర్ణయం
- ఇరాన్‌తో ఒప్పందం వరకూ కొనసాగుతుందన్న అమెరికా పోర్చుల దిగ్బంధనం మాత్రం యథాతథం
- శాంతి చర్చలపై ఇంకా అనిశ్చితి
- ముందుగా కఠిన వ్యాఖ్యలు చేసిన ట్రంప్ వైఖరిలో మార్పు
- పాక్ దౌత్య ప్రయత్నాలతో తాత్కాలిక ఉపశమనం

ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక మలుపు తీసుకున్నారు. పాకిస్తాన్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటూ కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో చేసిన పోస్టులో ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఇరాన్‌తో ఏకీకృత ఒప్పందం

(మిగతా 2వ పేజీలో)



## వచ్చే ఎన్నికల్లో
# బీఆర్ఎస్‌దే అధికారం : హరీశ్

- పోటీ సభతో సీఎం సంకుచిత బుద్ధి బయటపడిందని ఆరోపణ
- ప్రసంగాల వీక్షణలో భారీ తేడా చూపిస్తూ బీఆర్ఎస్ వాదన
- ఓటుకు నోటు కేసు ప్రస్తావనతో రాజకీయంగా దాడి

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత ముదురుతోంది. జగిత్యాలలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు చేసిన ప్రసంగం, కాటారం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందనపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రయోజనాలపై కేసీఆర్ హుందాగా మాట్లాడితే, సీఎం మాత్రం వ్యక్తిగత వ్యాఖ్యలకే పరిమితమయ్యారని అన్నారు. కేసీఆర్ సభకు పోటీగా సభ నిర్వహించడం ద్వారా సీఎం సంకుచిత రాజకీయాలను బయటపెట్టుకున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ ప్రసంగాన్ని లక్షలాది మంది వీక్షించగా, సీఎం ప్రసంగానికి తక్కువ స్పందన రావడం ప్రజాభిమానాన్ని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ప్రస్తుత సీఎంను ప్రస్తావించకుండా మాట్లాడితే, రేవంత్‌రెడ్డి మాత్రం బీఆర్ఎస్‌పై విమర్శలతోనే కాలం గడుపుతున్నారని అన్నారు. ఓటుకు నోటు కేసును ప్రస్తావిస్తూ, ఆ కేసులో స్టే ఎత్తివేస్తే సీఎం నేరుగా జైలుకెళ్లే పరిస్థితి వస్తుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసులో విచారణ సుప్రీంకోర్టులో జరుగుతుండగా, ప్రభుత్వ తరఫున సాధారణ న్యాయవాదులను పెట్టి, వ్యక్తిగతంగా ఖరీదైన న్యాయవాదులను నియమించుకోవడం వెనుక ఉద్దేశ్యాన్ని ప్రశ్నించారు. ఈ కేసులో బీఆర్ఎస్ నేతలు కూడా ఇంప్లీడ్ అయినట్లు

(మిగతా 2వ పేజీలో)



## ప్రభుత్వంతో చర్చలు విఫలం..
## అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్న ఆర్టీసీ బస్సులు

- ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతల చర్చలు
- నాలుగు వారాల సమయం కోరిన ప్రభుత్వ కమిటీ
- తమ డిమాండ్లు పాతవేనని స్పష్టం చేసిన జేఏసీ
- అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించిన జేఏసీ

## తమిళనాడులో ముగిసిన ఎన్నికల ప్రచారం... మూగబోయిన మైకులు

- తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్
- బెంగాల్‌లో 152 స్థానాలకు పోలింగ్.. మే 4న వెల్లడి కానున్న ఫలితాలు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార హోరుకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెరపడింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల కీలకమైన "నిశ్శబ్ద సమయం" (సైలెన్స్ పీరియడ్) అధికారికంగా ప్రారంభమైంది. దీంతో బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రసంగాలకు ఫుల్‌స్టాప్ పడింది. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 23న తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్ జరగనుండగా, బెంగాల్ లో తొలి దశ పోలింగ్ జరగనుంది. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ పదవీకాలం మే 10న ముగియనుండటంతో, మార్చి 15న ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరపనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో, గత కొన్ని వారాలుగా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేశాయి. అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, అన్నాడీఎంకే నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ద

(మిగతా 2వ పేజీలో)



## బ్యాంకింగ్ లోపాలే సైబర్ ముఠాలకు బలం

- మ్యూల్ ఖాతాల కేసులో 32 మంది బ్యాంకు సిబ్బంది అరెస్టు
- ఆర్బీఐ గవర్నర్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనర్ లేఖ
- కేవైసీ నిర్లక్ష్యం వల్లే మోసాలకు దారి
- బ్రాంచ్ అధికారులను బాధ్యులుగా నిలపాలన్న సూచన





## కేరళ త్రిస్సూర్‌లో బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- 13 మంది మృతి, మరో 13 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ
- గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం
- ఘటనపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తీవ్ర విచారం

త్రిస్సూర్ : కేరళలోని త్రిస్సూర్‌లో ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి 13 మంది ప్రాణాలు

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ ప్రయాణికులకు శుభవార్త.. 8 కొత్త రైళ్లు ప్రకటించిన కేంద్రం

- తెలంగాణలో రైల్వే కనెక్టివిటీని పెంచుతూ 8 కొత్త వీక్లీ రైళ్లు
- కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి నుంచి ఈ రైళ్లు నడపనున్నట్టు వెల్లడి
- తిరుపతి, భువనేశ్వర్, జైపూర్ వంటి నగరాలకు మెరుగైన ప్రయాణం

వాయిస్ ఆఫ్ ప్రజలు

బుధవారం, ఏప్రిల్ 22, 2026

# ప్రభుత్వంతో చర్చలు విఫలం.. అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్న ఆర్టీసీ బస్సులు



**ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతల చర్చలు**

**నాలుగు వారాల సమయం కోరిన ప్రభుత్వ కమిటీ**

**తమ డిమాండ్లు పాతవేనని స్పష్టం చేసిన జేఏసీ**

**అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించిన జేఏసీ**

తెలంగాణ ప్రభుత్వంతో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీనితో ఈరోజు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతలు చర్చలు జరిపారు. ఈ క్రమంలో డిమాండ్లపై ప్రభుత్వానికి నాలుగు వారాల సమయం ఇవ్వాలని జేఏసీ నేతలను కమిటీ కోరింది. అప్పటి వరకు సమ్మెను విరమించుకోవాలని కోరింది. అయితే ఐఏఎస్ అధికారుల కమిటీ విజ్ఞప్తిని జేఏసీ నాయకులు అంగీకరించలేదు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. చర్చల అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ, తమ సమస్యలను ఐఏఎస్ అధికారుల కమిటీకి వివరించామని తెలిపారు. వారు నాలుగు వారాల గడువు కోరారని, కానీ తమ డిమాండ్లు కొత్తవి కావని వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీలనే తాము అడుగుతున్నామని అన్నారు. తమ మాట విని నాలుగు వారాలు ఆగాలని కమిటీ కరాఖండిగా చెప్పిందని, దీనితో తప్పనిసరి పరిస్థితుల్లో తాము సమ్మెకు వెళుతున్నామని తెలియజేశారు. 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు తాము సమ్మెను కొనసాగిస్తామని వెల్లడించారు.

# బ్యాంకింగ్ లోపాలే సైబర్ ముఠాలకు బలం

**మ్యూల్ ఖాతాల కేసులో 32 మంది బ్యాంకు సిబ్బంది అరెస్టు**

**ఆర్బీఐ గవర్నర్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనర్ లేఖ**

**కేవైసీ నిర్లక్ష్యం వల్లే మోసాలకు దారి**

**బ్రాంచ్ అధికారులను బాధ్యులుగా నిలపాలన్న సూచన**

**ప్రైవేటు బ్యాంకుల్లో అక్రమ ఖాతాలు ఎక్కువగా ఉన్నాయన్న ఆందోళన**

**సంయుక్త వర్కింగ్ గ్రూపు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ అవసరం**



హైదరాబాద్: సైబర్ నేరాల పెరుగుదలకు బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలే ప్రధాన కారణమవుతున్నాయని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాస్తూ సమూల మార్పులు తీసుకురావాలని కోరారు. సైబర్ క్రైమ్ ముఠాలపై 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన దాడుల్లో మ్యూల్ ఖాతాలను సమకూర్చడంలో సహకరించిన 32 మంది బ్యాంకు సిబ్బందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థలోని బలహీనతలు బహిర్గతమయ్యాయని సజ్జనర్ లేఖలో ప్రస్తావించారు. మ్యూల్ ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధృవీకరణలో బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకున్నప్పుడు సంబంధిత బ్యాంకు బ్రాంచ్ అధికారులను బాధ్యులుగా నిలపాలని, దీనిపై ఆర్బీఐ వాణిజ్య బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ప్రత్యేకంగా ప్రైవేటు బ్యాంకుల్లోనే అధిక సంఖ్యలో అక్రమ ఖాతాలు వెలుగులోకి వస్తున్నాయని, కొన్ని బ్యాంకులు ఆర్బీఐ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలకు సహకరించిన లేదా ఛార్జిషీట్ నమోదైన బ్యాంకు అధికారులను శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో ఉంచే విధానం అవసరమని పేర్కొన్నారు. మ్యూల్ ఖాతాలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్బీఐ ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, నగర పోలీసులు కలిసి పనిచేసేలా జాయింట్ వర్కింగ్ గ్రూపు ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలను క్షణాల్లో గుర్తించే సాంకేతిక వ్యవస్థలను తప్పనిసరిగా అమలు చేయాలని కూడా లేఖలో పేర్కొన్నారు. ఈ సూచనల అమలు ద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయవచ్చని సజ్జనర్ అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ ప్రయాణికులకు శుభవార్త.. 8 కొత్త రైళ్లు ప్రకటించిన కేంద్రం

**తెలంగాణలో రైల్వే కనెక్టివిటీని పెంచుతూ 8 కొత్త వీక్లీ రైళ్లు**

**కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి నుంచి ఈ రైళ్లు నడపనున్నట్టు వెల్లడి**

**తిరుపతి, భువనేశ్వర్, జైపూర్ వంటి నగరాలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ కొత్త రైళ్ల వివరాలను అధికారికంగా ప్రకటించిన వైనం**

తెలంగాణ ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే దిశగా 8 కొత్త వీక్లీ ప్రత్యేక రైళ్లకు ఆమోదం తెలిపింది. ఈ రైళ్లు హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి తిరుపతి, తిరుచానూర్, భువనేశ్వర్, జైపూర్, శ్రీ గంగానగర్ వంటి కీలక నగరాలకు రాకపోకలు సాగిస్తాయి. ఈ కొత్త రైళ్ల ఏర్పాటుపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి నిరంతరం సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త రైళ్లు రాష్ట్ర అభివృద్ధికి, పౌరుల సౌకర్యానికి ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

**కొత్తగా ప్రకటించిన రైళ్ల పూర్తి వివరాలు:**

1.ట్రైన్ నెం. 17607/17608: కాచిగూడ – తిరుచానూర్ (ప్రతి గురువారం రాత్రి 9:30 గంటలకు, మే 15 నుంచి ప్రారంభం) 2.ట్రైన్ నెం. 17601/17602: కాచిగూడ – శ్రీ గంగానగర్ (ప్రతి శనివారం రాత్రి 10:00 గంటలకు, జులై 14 నుంచి ప్రారంభం) 3.ట్రైన్ నెం. 17047/17048: చర్లపల్లి – తిరుచానూర్ (ప్రతి బుధవారం సాయంత్రం 6:55 గంటలకు, మే 7 నుంచి ప్రారంభం) 4.ట్రైన్ నెం. 17441/17442: చర్లపల్లి – తిరుపతి (ప్రతి బుధవారం రాత్రి 9:20 గంటలకు, మే 14 నుంచి ప్రారంభం) 5.ట్రైన్ నెం. 17443/17444: చర్లపల్లి – తిరుపతి (ప్రతి శుక్రవారం సాయంత్రం 4:20 గంటలకు, మే 15 నుంచి ప్రారంభం) 6.ట్రైన్ నెం. 17059/17060: చర్లపల్లి – తిరుచానూర్ (ప్రతి ఆదివారం రాత్రి 9:15 గంటలకు, మే 11 నుంచి ప్రారంభం) 7.ట్రైన్ నెం. 17067/17068: చర్లపల్లి – భువనేశ్వర్ (ప్రతి సోమవారం సాయంత్రం 6:10 గంటలకు, మే 5 నుంచి ప్రారంభం) 8.ట్రైన్ నెం. 17079/17080: నాంపల్లి – జైపూర్ (ప్రతి శుక్రవారం రాత్రి 7:50 గంటలకు, ప్రారంభ తేదీ ప్రకటించాల్సి ఉంది)



# విదేశాల్లో ఇంతేనంటూ... బాయ్ ఫ్రెండ్ కళ్లకు గంతలు కట్టి నిప్పంటించిన యువతి

**ప్రపోజల్ పేరుతో ప్రియుడిని దారుణంగా హత్య చేసిన యువతి**

**బెంగళూరులో జరిగిన ఈ ఘటనలో ప్రేరణ అనే యువతి అరెస్ట్**

**కుర్చీకి కట్టేసి, నిప్పంటించి ప్రియుడు కిరణ్ ను సజీవదహనం**

**నిర్లక్ష్యం చేస్తున్నాడనే కోపంతోనే ఘాతుకానికి పాల్పడినట్లు వెల్లడి**

**విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితురాలు**

బెంగళూరు: బెంగళూరులో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. పెళ్లి ప్రపోజల్ అని నమ్మించి, ప్రియుడిని కుర్చీకి కట్టేసి, నిప్పంటించి సజీవదహనం చేసిందో యువతి. ఈ కిరాతక ఘటనలో కిరణ్ (27) అనే యువకుడు మృతి చెందగా, నిందితురాలైన అతని ప్రేయసి ప్రేరణ (27)ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరులోని ఒక టెలికాం స్టోర్‌లో పనిచేస్తున్న కిరణ్, ప్రేరణ గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే, ఇటీవల కిరణ్ తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని, పెళ్లి చేసుకోడని ప్రేరణ భావించింది. దీంతో అతడిపై తీవ్రమైన కక్ష పెంచుకుంది. మంగళవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరణ్ ను పిలిపించింది. 'విదేశాల్లో ఇలాగే ప్రపోజ్ చేస్తారు' అని నమ్మించి, కిరణ్ కళ్లకు గంతలు కట్టి కుర్చీలో బంధించింది. ఆమె మాటలు నమ్మిన కిరణ్, ప్రపోజల్ కోసం ఎదురుచూస్తుండగా, ప్రేరణ అతనిపై మండే ద్రవాన్ని పోసి నిప్పంటించింది. కిరణ్ మంటల్లో కాలిపోతుండగా ఆమె చూస్తూ నిలబడింది. ఈ ఘటనలో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రేరణను అదుపులోకి తీసుకుని విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించింది. "వారిద్దరూ ప్రేమలో ఉన్నారు. కానీ ఇటీవల అతను తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆమె భావించింది" అని డీసీపీ డి.ఎల్. నాగేశ్ తెలిపారు. ప్రేరణ తన తల్లి, సోదరుడితో కలిసి అంజనాపురలో నివసిస్తోంది. ఈ పథకం ప్రకారం జరిగిన హత్యపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



# ఘోష్ కమిషన్‌పై హైకోర్టులో నేడే తీర్పు

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలున్న అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లకు సంబంధించి తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించనుంది. ఈ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్.కె. జోషి వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. మార్చి 12న విచారణ పూర్తిచేసిన అనంతరం తీర్పును రిజర్వు చేసిన కోర్టు, తొలుత ఈ నెల 8న తీర్పు ఇవ్వాలని నిర్ణయించినా, అనంతరం 22వ తేదీకి వాయిదా వేసింది. దీంతో ఈ రోజు వెలువడనున్న తీర్పుపై రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పిటిషనర్లు తమ వాదనలో కమిషన్ విచారణ ప్రక్రియలో పలు నిబంధనలు ఉల్లంఘించబడ్డాయని, అభియోగాలు మోపే ముందు తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాల పేరుతో వ్యక్తుల పరువు ప్రతిష్ఠలను దెబ్బతీయడం సరికాదని వాదించారు. ఇక ప్రభుత్వం తరఫు న్యాయవాదులు మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలు తీవ్రంగా ఉండటంతో ప్రజాప్రయోజనాల దృష్ట్యా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు కోర్టుకు వివరించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పు కాళేశ్వరం వ్యవహారంలో కీలక మలుపు తిప్పే అవకాశముండటంతో అన్ని వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## కాల్పుల విరమణపై ట్రంప్ యూటర్న్!

కుదిరే వరకు, శాంతి చర్చలు పూర్తి అయ్యే దాకా కాల్పుల విరమణ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే ఇరాన్ పోర్టులపై కొనసాగుతున్న దిగ్బంధన చర్యలు మాత్రం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ అంశంపై సైన్యాన్ని అప్రమత్తంగా ఉంచాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల నుంచి వరుసగా విజ్ఞప్తులు రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ చర్చలకు ముందుకు రావాలని, పరిస్థితిని సర్దుబాటు చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని పాకిస్తాన్ ప్రయత్నాలు కొనసాగించింది. ఇంతకుముందు మాత్రం ట్రంప్ ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శాంతి ఒప్పందం కుదరకపోతే సైనిక చర్యలు కూడా తీసుకోవచ్చని హెచ్చరించారు. కాల్పుల విరమణ గడువు పొడిగింపుపై ఆసక్తి లేదని స్పష్టం చేసిన ఆయన, ఇప్పుడు నిర్ణయం మార్చుకోవడం గమనార్హం. ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత శాంతి చర్చలకు ఇరాన్ ఆసక్తి చూపకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతలు, నౌకా దాడుల నేపథ్యంలో ఇరాన్ కఠిన వైఖరిని కొనసాగిస్తోంది. ఈ పరిణామాల మధ్య పాకిస్తాన్ దౌత్యపరంగా చురుకుదనాన్ని పెంచి, రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వానికి ప్రయత్నించింది. కాల్పుల విరమణ గడువును పొడిగించి మరోసారి చర్చలకు అవకాశం ఇవ్వాలని కోరింది. ఈ క్రమంలో ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం ప్రాంతంలో తాత్కాలిక ఉపశమనానికి దారితీసినట్లు భావిస్తున్నారు.

## కాళేశ్వరం అక్రమాలపై మీరే విచారించండి

తాజా లేఖలో కోరింది. ఈ నెల 7న పంపిన లేఖలో ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, 1946లోని నిబంధనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించింది. ఇదిలా ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్‌ను నియమించింది. సుదీర్ఘ విచారణ, వాంగ్మూలాల సేకరణ అనంతరం కమిషన్ గత ఏడాది ఆగస్టులో తన నివేదికను సమర్పించింది. ఆ నివేదికపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ జరిగిన తర్వాత దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. డీఎస్‌పీఈ చట్టంలోని సెక్షన్--6 ప్రకారం రాష్ట్రం ఇప్పటికే సీబీఐ దర్యాప్తుకు అనుమతి నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ) ద్వారా సెక్షన్--5 కింద తదుపరి నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉందని సీబీఐ సూచించింది. ఈ మేరకు 'సింగిల్ విండో' విధానం ప్రకారం అవసరమైన చెక్‌లిస్ట్‌ను జతచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజా లేఖలో వివరాలు పంపింది. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు జారీ చేయాలని, అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తి స్థాయి దర్యాప్తు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో ఈ కేసులో తదుపరి చర్యలపై దృష్టి నెలకొంది.

## వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారం: హరీశ్

తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులను కలిసినట్లు ఆయన చెప్పారు. ఇందులో ఎలాంటి రహస్యమూ లేకపోయినా, సీఎం మీడియా ద్వారా ప్రచారం చేస్తూ రాజకీయ లాభం పొందాలని చూస్తున్నారని విమర్శించారు. రైతు భరోసా విషయంలో కూడా సీఎం వైఖరిని హరీశ్‌రావు తప్పుబట్టారు. రెండు సీజన్లుగా రైతులకు ఇవ్వాల్సిన సాయం నిలిపివేసి, కేసీఆర్ సభ నేపథ్యంలో ఒక్క విడత మాత్రమే విడుదల చేశారని అన్నారు. ఇంకా వేల కోట్ల రూపాయలు రైతులకు రావాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రాజెక్టుల అంశంలో కూడా ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో విమర్శలు చేసిన ప్రభుత్వం ఇప్పుడు మరమ్మతుల గురించి మాట్లాడటం విరుద్ధంగా ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు విషయమై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని రాజకీయ ప్రయత్నాలు చేసినా రేవంత్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యే అవకాశం లేదని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

## కేరళ త్రిస్సూర్‌లో బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

కోల్పోయారు. ఈ దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రధాని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రధాని జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అధికారిక వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో మరో 13 మంది గాయపడగా, వారిని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రసిద్ధ త్రిశూర్ పూరం ఉత్సవాలకు ముందు ఈ దుర్ఘటన జరగడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాదంపై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. సీపీఐ కార్యదర్శి బినోయ్ విశ్వం స్పందిస్తూ, పండుగల సమయంలో ప్రమాదకరమైన పేలుడు పదార్థాల వాడకంపై పండుగ కమిటీలు, మత పెద్దలు పునరాలోచించాలని సూచించారు. ఈ ఘటనతో బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## తమిళనాడులో ముగిసిన ఎన్నికల ప్రచారం... మూగబోయిన మైకులు

మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీటికి తోడు నామ్ తమిళర్ కట్చి, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలు కూడా స్వతంత్రంగా బరిలో నిలవడంతో ఈసారి చతుర్ముఖ పోటీ ఆసక్తికరంగా మారింది. మండుటెండలను సైతం లెక్కచేయకుండా అగ్రనేతలంతా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, భారీ బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ప్రచారం ముగియడంతో, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను నిర్ధారించేందుకు కఠినమైన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. తమిళనాడు ముఖ్య ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ఈ మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఏప్రిల్ 21 సాయంత్రం 6 గంటల నుంచి ఏప్రిల్ 23న పోలింగ్ ముగిసే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఈ నిబంధనల ప్రకారం, బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచార సంబంధిత సమావేశాలను నిర్వహించరాదు. టెలివిజన్, రేడియో, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికలతో పాటు ఎస్ఎంఎస్‌లు లేదా ఇంటర్నెట్ ద్వారా ఎన్నికల సంబంధిత కంటెంట్‌ను వ్యాప్తి చేయడంపై పూర్తి నిషేధం విధించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశంతో సంగీత, నాటక ప్రదర్శనలు వంటి వినోద కార్యక్రమాలను నిర్వహించడం కూడా నిషిద్ధం. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. నియోజకవర్గంలో ఓటర్లు కాని రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు నిశ్శబ్ద సమయం ప్రారంభం కాకముందే ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు కళ్యాణ మండపాలు, హాస్టళ్లు, అతిథి గృహాలపై నిఘా కట్టుదిట్టం చేశారు. అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్లకు జారీ చేసిన వాహన అనుమతులు మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత చెల్లవు. పోలింగ్ రోజున అభ్యర్థులకు పరిమిత సంఖ్యలో వాహనాలకు అనుమతి ఉంటుంది, వాటిని కూడా రిటర్నింగ్ అధికారులు నియంత్రిస్తారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి వాహనాలను అద్దెకు తీసుకోవడం లేదా ఉపయోగించడం పూర్తిగా నిషేధం. అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఇద్దరు వ్యక్తులతో మాత్రమే ఎన్నికల బూత్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడ కూడా జనం గుమిగూడటానికి అనుమతి లేదు.

# ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ముని శిరీషకు పీహెచ్.డీ.



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు: ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని సుంకర ముని శిరీషను డాక్టరేట్ వరించింది. 'సంభావ్య మధుమేహ నిరోధక కారకాలుగా ఎన్–హెటెరోసైక్లిక్ సమ్మేళనాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ సంబంధిత మూల్యాంకనం' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బేడ దుర్గాప్రసాద్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ ముని శిరీష డాక్టరేట్ పరిశోధన, టైప్ 2 డయాబెటిస్ మెల్లిటస్ (టీ2డీఎం) నిర్వహణ కోసం నూతన చికిత్సా అణువులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిందని తెలియజేశారు. వినూత్న మెడిసినల్ కెమిస్ట్రీ, గ్రీన్ సింథసిస్ పద్ధతుల ద్వారా, భోజనం తరువాత రక్తంలో గ్లూకోజ్ స్థాయిలతో ముడిపడి ఉన్న కీలక ఎంజైమ్ లకు వ్యతిరేకంగా బలమైన నిరోధక చర్యను కలిగి ఉన్న ఆశాజనకమైన హెటెరోసైక్లిక్ సమ్మేళనాలను ఈ అధ్యయనం గుర్తించినట్టు వివరించారు. వీటిలో కొన్ని సమ్మేళనాలు ప్రామాణిక ఔషధమైన అకార్బోస్ తో సమానమైన సామర్థ్యాన్ని ప్రదర్శించాయన్నారు.

ఈ పరిశోధన, సురక్షితమైన, మరింత ప్రభావవంతమైన మధుమేహ నిరోధ చికిత్సల అభివృద్ధికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుంది, భవిష్యత్ ప్రీ–క్లినికల్, క్లినికల్ పరిశోధనలకు బలమైన పునాదిని వేస్తుందని తెలిపారు. ముని శిరీష సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# లండన్‌లో తెలుగు విద్యార్థికి ఘోర అవమానం

హైదరాబాద్ : ఏప్రిల్ 21 ( వాయిస్ టుడే )బీ లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హెర్ట్‌ఫోర్డ్‌షైర్ ( University of Hertfordshire ) లో ఎమ్మెస్( MS) చేసేందుకు హైదరాబాద్ కు చెందిన ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తి 2026 జనవరిలో వెళ్లారు. జనవరి 30న యూనివర్సిటీ యాజమాన్యంతో అకామిడేషన్ విషయంపై మాట్లాడుతుండగా అక్కడ అధికారులు విద్యార్థి ప్రసాద్ రెడ్డిని ( స్టూడెంట్ ఐడి 25050957 ) తీవ్రంగా అవమానించారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ బెగ్గర్ , యూస్ లెస్ ఫెల్లో అంటూ అసభ్య పదజాలంతో దూషించారన్నారు. అంతేకాకుండా ఆ విద్యార్థిని బలవంతంగా ఇండియా కి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై యూనివర్సిటీ ఉన్నత అధికారులకు పలుమార్లు పిర్యాదు చేసినప్పటికీ ఫలితంలేకుండా పోయిందన్నారు. విద్యార్థి ప్రసాద్ రెడ్డి తనకు జరిగిన అవమానం తట్టుకోలేక మానసిక వేదనతో లండన్ లో కుమిలిపోయాడు. తన భాద ఎవరికి చెప్పుకోవలో తెలియక మానసిక వేదనతో ఆరోగ్యం క్షీణించింది. కుటుంబ సభ్యుల సహాయంతో ఇండియాకి తిరిగి వచ్చాడు. ఇండియాకి వచ్చాక కూడా డిస్ ట్రెస్ వల్ల ప్రసాద్ రెడ్డి బ్రెయిన్ సంబంధించిన వ్యాధితో ఆసుపత్రి పాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. బహుషత్తులో ప్రసాద్ రెడ్డి విద్యాపరంగా ముందుకు రాణించలేరని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ఆల్ ఇండియా విద్యార్థి సంఘాల నేతలు భారతదేశంలో విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలు కూడా యూనివర్సిటీ ఆఫ్ హెర్ట్‌ఫోర్డ్‌షైర్ విశ్వవిద్యాలయంతో ఎటువంటి అనుసంధానం, అవగాహన ఒప్పందాలు చేసుకోకూడదని అలాగే అక్కడికి తెలుగు విద్యార్థులను, భారతీయులను కూడా పంపకూడదని కోరారు. ఉన్నత విద్యలో ఆచార్యులు విద్యార్థులకు సంస్కారం పెంచాలి కానీ ఈ విధంగా భారతీయ విద్యార్థులను అవమానపరిచే విధంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. లండన్ తెలుగు విద్యార్థి అసోసియేషన్ తో మాట్లాడామని... హెర్ట్‌ఫోర్డ్‌షైర్ యూనివర్సిటీ పై లీగల్ యాక్షన్ తీసుకుంటామని ఆల్ ఇండియా విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యార్థి ప్రసాద్ రెడ్డికి న్యాయం జరిగేవరకు న్యాయ పోరాటం చేస్తామన్నారు. దీనిపై దేశ స్థాయిలో రాజకీయ పార్టీలు, ప్రభుత్వ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



# శ్రీ సాయి ఎస్‌వై నగర్ కాలనీలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం

## ప్రారంభించిన మాజీ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్దం లోకేష్

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్,ఏప్రిల్ 21 : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడెం శ్రీ సాయి ఎస్‌వై నగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్ల పనులు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ మాజీ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్దం లోకేష్,అక్బర్, మహాలక్ష్మి కాలనీ అధ్యక్షులు రూపం విష్ణు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఇ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కాంతా రెడ్డి మాట్లాడుతూ,కాలనీవాసుల ఇబ్బందులను గమనించిన కిషోర్ గౌడ్ రోడ్ల నిర్మాణానికి పూర్తి సహకారం అందించి, ఈ సీసీ రోడ్ల నిర్మాణం జరగడానికి ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ఇందుకు కాలనీవాసులు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా కాలనీలో ఇంకా కొన్ని రోడ్లు నిర్మాణం కావాల్సి ఉన్నందున, అవి కూడా త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా మనవి చేయడం జరిగింది. అనంతరం కిశోర్ గౌడ్ మాట్లాడుతూ, రెండు నెలలో పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ గిరి కొండపల్లి, కోశాధికారి జి.సత్తయ్య, కాలనీ పెద్దలు బాలకృష్ణా రెడ్డి, మునీర్ హైమద్, సూర్య ప్రకాష్ రావు, ప్రసాద్, రాజి రెడ్డి, ఎల్లారెడ్డి, జోజయ్య, సత్యనారాయణ, లక్ష్మీ నారాయణ సాయిలు, రవి యాదవ్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బౌరంపేట్ స్నేక్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఫారెస్ట్ ఆఫీసర్ వినతి

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 21(వాయిస్ టుడే): ఇటీవల బౌరంపేట్ లోని స్నేక్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజు , బీఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద బౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. వెంటనే ఎమ్మెల్సీ ఎమ్మెల్యే స్పందించి మేడ్చల్ జిల్లా ఫారెస్ట్ అధికారి పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఫోన్ లో అధికారితో మాట్లాడారు. మరియు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కోరుతున్న ఎమ్మెల్యే సిఫాసు లేఖను మేడ్చల్ జిల్లా ఫారెస్ట్ అధికారి మర్యాదపూర్వకంగా కలిసి అందజేసిన బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వి సురేందర్ రెడ్డి, సరుగారి ధర్మారెడ్డి, పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి . ఈ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీసర్ సానుకూలంగా స్పందిస్తూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు అధికారులతో చర్చించి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.



# పీసీసీ ప్రోటోకాల్ చైర్మన్ హార్కర గోపాల్ రావుని మర్యాదపూర్వకంగా కలిసిన వైస్ చైర్మన్ కిషోర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 21(వాయిస్ టుడే ): పిసిసి ప్రోటోకాల్ చైర్మన్ హార్కర గోపాల్ రావు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన పీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ సాదు యాదవ్ దుర్గ ప్రసాద్ పవన్ కుమార్ తదితరులు కలిసే శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ -- చోరీ కేసుల ఛేదన




కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 21(వాయిస్ టుడే ): జగద్గిరిగుట్ట పోలీసులు చాకచక్యంగా పనిచేసి పలువురు చోరీ కేసుల్లో పాల్గొన్న ఒక అలవాటు నేరస్థుడిని పట్టుకుని, దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. తేదీ: 21.04.2026 న విశ్వసనీయ సమాచారం ఆధారంగా మొహమ్మద్ సమీర్ ఖాన్ (24 సంవత్సరాలు), నివాసం: కోవ్మూర్, సికింద్రాబాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు మద్యం మరియు గంజాయి అలవాట్లకు బానిసై, విలాసవంతమైన జీవితానికి డబ్బు కోసం చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. జగద్గిరిగుట్టతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు.

కేసుల వివరాలు:

ఆల్విన్ కాలనీ నుండి కేటీఎం బైక్ మరియు మొబైల్ ఫోన్ల చోరీ

శుభోదయ కాలనీ నుండి టీవీఎస్ జూపిటర్ స్కూటీ చోరీ

నేర విధానం: నిందితుడు రాత్రి సమయంలో పార్క్ చేసిన వాహనాలు మరియు లాక్ చేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని, తాళాలు పగలగొట్టి లేదా ఓపెన్ హౌస్‌లలోకి ప్రవేశించి బైక్‌లు, మొబైల్ ఫోన్లు దొంగిలించేవాడు.

స్వాధీనం చేసిన ఆస్తి: ఒక శంసుంగ్ మొబైల్ ఫోన్, ఒక ఒప్పో మొబైల్ ఫోన్

ఒక టీవీఎస్ జూపిటర్ స్కూటీ, ఒక కేటీఎం 200 బైక్

పై రెండు బైకులను నిందితుడి ఇంటి వద్ద నుండి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడు గతంలో మాధాపూర్, సనత్‌నగర్, కూకట్‌పల్లి, ఎస్.ఆర్. నగర్, బేగంపేట్, అల్లాపూర్ ప్రాంతాల్లో పలుచోట్ల చోరీ కేసుల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన వ్యక్తిగా గుర్తించారు.డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, నరేంద్ర రెడ్డి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



# ప్రజల నుండి వినతులను స్వీకరించిన స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 21(వాయిస్ టుడే ) కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ షాపూర్ నగర్ లోని వారి నివాసంలో నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక ప్రజలు పలు సమస్యలపై కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం మరియు అంతర్గత రోడ్లు మరియు ఇతర సమస్యలపై వారిని కలిసి వినతి పత్రాలను అందించారు. వారు తక్షణమే స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి కొన్నిటిని తక్షణమే పరిష్కరించారు ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిన్నం చెరువు అలుగు నాలా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం : ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 21(వాయిస్ టుడే ): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట్ డివిజన్ పరిధిలోని మల్లంపేట్ చిన్నం చెరువు అలుగు నాలా సమస్యను పరిష్కరించేందుకు దాదాపు 9.80 కోట్ల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న నాలా నిర్మాణ పనులతో తలెత్తనున్న సమస్యలను స్థానికులు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా ఉదయం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ వివిధ విభాగాల అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వరద నీటితో ముంపుకు గురవుతున్న కాలనీల ముంపు సమస్య – పరిష్కారంలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద నీటితో ముంపుకు గురవుతున్న ప్రాంతాల్లో తీవ్రతను తగ్గించే దిశగా చర్యలు చేపట్టి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజా ప్రయోజనాలే తమ ప్రాధాన్యతనని, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపి సమస్యను పరిష్కరిస్తామన్నారు.ప్రతిపాదిత నాలా నిర్మాణం వల్ల ఎక్కువగా ఆస్తినష్టం జరిగే పరిస్థితి ఉన్నందున గ్రామం శివారు నుంచి కాకుండా పూర్వపు నాలా ద్వారానే నీటి ప్రవాహ దిశకు అనుగుణంగానే కాలువ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు.గ్రామస్తుల ఆందోళన మాకు తెలుసని ఈ సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను అందరి ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ లేక్స్, ఇరిగేషన్, మున్సిపల్, హైడ్రా విభాగాలకు చెందిన పలువురు అధికారులు, ప్యాక్స్ చైర్మన్ మిద్దల బాల్ రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ రవికిరణ్, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మాదాసు వెంకటేశం, అర్కల అనంతస్వామి, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శామీర్ పేట హన్మంత్ రావు, ఎంబరి ఆంజనేయులు, విష్ణువర్ధన్ రెడ్డి, నాచారం మురళీ యాదవ్, శంకర్ నాయక్, మరియు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, పలు కాలనీల వాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా దామాషా ప్రకారం స్థానిక, పార్టీ పదవులలో అవకాశాలు కల్పించాలి

## మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్.. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ సమావేశం

## మంత్రులు దామోదర, కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్న నీలం



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : రాబోయే స్థానిక ఎన్నికలు, కాంగ్రెస్ పార్టీ పదవులలో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని, సామాజిక న్యాయం పాటించినప్పుడే పార్టీకి క్షేత్రస్థాయిలో తిరుగులేని విజయం లభిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ స్పష్టం చేశారు. మంగళవారం సంగారెడ్డి పట్టణం లోని రెడ్లాస్ హోటల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి సమక్షంలో జరిగిన ఈ భేటీలో జిల్లా రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహాలపై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, ఏ సామాజిక వర్గానికైనా వారి జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల ఆకాంక్షలను గౌరవిస్తూ టిక్కెట్ల పంపిణీ జరగాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో పార్టీని బలోపేతం చేసేందుకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు దక్కాలని ఆయన కోరారు. మంత్రులు దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ పార్టీ లో వర్గపోరు లేనప్పుడే పార్టీకి లాభం జరుగుతుందని అన్నారు, అందరినీ కలుపుకొని పార్టీని విజయపథంలో నడిపిస్తామని నేతలకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పటాన్చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ ఆంజనేయులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు శశికళ యాదవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, టోపాజీ అనంత కిషన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కాట సుధా, కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, పాల్గొన్నారు..

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
బుధవారం 22 ఏప్రిల్ 2026

# విద్యార్థుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం

## వెంటనే ఫీజుల బకాయిలు చెల్లించాలి

## ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తేకపోతే, వారి క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తాం

## ఎంపీ ఆర్ కృష్ణయ్య



ముషీరాబాద్, ఏప్రిల్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం అని, వెంటనే ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించాలని ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యానగర్ లోని బీసీ భవన్ లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోడీ రాందేవ్ అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల కోసం ఆందోళనలు చేసినా, ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడించినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లైన లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులను విద్యార్థుల ఫీజు బకాయిల సమస్యను పట్టించుకునే తీరిక లేదని, రాష్ట్రంలో భూ కబ్జాలు, అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. బకాయిల కోసం ఇక నుంచి ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టిడిస్తామని, ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు బకాయిలను లూటీ చేస్తున్నారని, ఎమ్మెల్యేలు విద్యార్థుల ఫీజు బకాయిల కోసం ప్రభుత్వంపై ఒత్తితీసుకురావాలని అన్నారు. రాష్ట్రంలో ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో ఎనిమిది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, అయినా ప్రభుత్వంలో చలనం రాకపోవడం సిగ్గు చేటన్నారు. ఇంకా ఫీజు బకాయిలు చెల్లించకుండా జాప్యం చేస్తే ఉధృతంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు మాత్రం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ఆర్టీఐ యాక్టు ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, కుంభకోణాలకు భయటకు లాగుతాని, ఏ మంత్రి, ఎమ్మెల్యే ఎంత మేర అవినీతి, కుంభకోణాలకు పాల్పడింది వెల్లడిస్తామన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే – విడుదల చేయాలని, విద్యార్థుల పూర్తి ఫీజుల స్కీమును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల వద్ద ఫీజు బకాయిలు వసూలు చేసుకోవాలని కోర్టు తీర్పునివ్వడం శోచనీయమని, ఈ విషయమై పార్లమెంటులో మాట్లాడుతనన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు అనంతయ్య, రాజేందర్, నిఖిల్, మహేష్. అఖిల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## పటాన్‌చెరు అభివృద్ధిపై మంత్రి దామోదర్ రాజనర్సింహతో కాట శ్రీనివాస్ గౌడ్ భేటీ

### ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తన నివాసంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా స్థానిక మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు ఇతర ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ అంశాలపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా డిక్లేర్ చేయాలి

### బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

హైద్రాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మాహానీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. అలాంటి మహానీయుడుని రాష్ట్ర ప్రభుత్వం జాతిపితగా డిక్లేర్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం లోయర్ ట్యాంక్ బండ్ లో వివిధ బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాజుల శ్రీనివాస్ గౌడ్, గణేష్ చారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్ల నిధులు నియామకాలు తెలంగాణ ప్రజలకు అందాలనే ఆకాంక్షతో తొలిదశ మలిదశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ కీలకంగా ఉన్నారని కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం పక్కన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం ఎదిరించి పోరాటం చేసిన జయశంకర్ సార్ జయంతి వర్ధంతిని అధికారికంగా నిర్వహించి జాతిపితగా ప్రకటిస్తూ జీవో తీయాలని కోరారు. అనంతరం జాతిపితగా ప్రకటించాలని బీసీ కుల సంఘాల ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఈ సమావేశంలో అనంతోజు బ్రహ్మచారి, వల్లబోజు నరసింహాచారి తో పాటు బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్‌గా శేఖర్ రెడ్డి భాద్యతల స్వీకరణ



కూకట్ పల్లి; ఏప్రిల్ 21(వాయిస్ టుడే): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కూకట్ పల్లి పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్ రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపీసీసీ) మూసాపేట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎండీ చన్ను పాషా, నాయకులు నర్సింహ, ఫిరోజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు శేఖర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## పవన్ కళ్యాణ్ ఆరోగ్యానికి ప్రత్యేక పూజలు -- గోపాల్ నగర్‌లో భక్తి వాతావరణం

కూకట్ పల్లి; ఏప్రిల్ 21(వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుతూ కూకట్‌పల్లి గోపాల్ నగర్‌లో భక్తి భావం ఉట్టిపడింది. ఇటీవల జరిగిన శస్త్రచికిత్స అనంతరం ఆయన శీఘ్ర కోలిక కోసం పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ సభ్యులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం గోకుల్ ఫ్లాట్స్‌లోని శ్రీ అభయ వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, ఆకు పూజలు ఘనంగా జరిగాయి. ఈ పూజలకు ముఖ్య అతిథిగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గోత్ర నామంతో పూజలు నిర్వహించి, అనంతరం 108 టెంకాయలు కొట్టి ఆయన త్వరగా కోలుకోవాలని భక్తితో ప్రార్థనలు చేశారు. ఆలయం పరిసరాలు భక్తులతో కిక్కిరిసి, "పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి" అనే నినాదాలతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో గోపాల్ నగర్ పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ సభ్యులు, జనసేన నాయకులు, కాలనీ వాసులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజా నాయకుడి ఆరోగ్యం కోసం అభిమానులు చేసిన ఈ భక్తి కార్యక్రమం స్థానికంగా విశేషంగా ఆకట్టుకుంది.




## మెదక్ జిల్లా తూప్రాన్‌లో మానవత్వానికి చిరస్మరణీయ సేవ

### అనాథ, మానసిక వికలాంగుల పిల్లలకు అవసరమైన సామగ్రి పంపిణీ

కుత్బుల్లాపూర్ : ఏప్రిల్ 21(వాయిస్ టుడే): మెదక్ జిల్లా తూప్రాన్ మండల పరిధిలోని కింగ్‌డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బేతనీయ ఆశ్రమంలో హృదయాన్ని హత్తుకునే సేవా కార్యక్రమం జరిగింది. అనాథ పిల్లలతో పాటు మానసిక వికలాంగులుగా ఉన్న చిన్నారులకు 4 నెలలకు సరిపడే సానిటరీ మరియు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సబ్బులు, బట్టలు, సర్ఫ్, బ్రష్‌లు, పేస్టులు, ఫినాయిల్, లైజాల్, డిష్ వాష్ లిక్విడ్స్, యాసిడ్స్, బూజు కర్రలు, మాపింగ్ స్టిక్స్, రూమ్ స్ప్రేలు, పర్ఫ్యూమ్ బాటిల్స్, మాపింగ్ టవల్స్ వంటి అనేక అవసరమైన సామగ్రిని ఆశ్రమానికి అందించారు. ఈ సహాయం ఆశ్రమంలో ఉన్న పిల్లల రోజువారీ అవసరాలకు ఎంతో తోడ్పడనుంది. సేవే సత్యమని సందేశం ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేసీఎమ్ ఎన్జీవో అధ్యక్షుడు బిషప్ క్రీస్తురాజు మాట్లాడుతూ "ఇలాంటి చిన్నారుల మధ్య సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. బేతనీయ ఆశ్రమాన్ని ఎంతో ఓర్పుతో నిర్వహిస్తున్న నిర్వాహకులు అభినందనీయం అన్నారు. మా వంతు సహాయం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. అలాగే ఈ అవకాశాన్ని కల్పించిన ఫాదర్ ధనరాజ్ మరియు ఫాదర్ జోషఫ్ ప్రభాకర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శకుంత, ఆంథోనీ, సన్నీ, అంజనీ, వరలక్ష్మి, సువర్ణ, భాస్కర్, రాజ్యలక్ష్మి, పద్మా, స్వర్ణ, ఎస్తేర్ రాణి, మేరీ, సుధీర్ వర్మ, ప్రకాశ్ వర్మ, నాగమణి, సత్తిబాబు, ఉదయ్, అరుణ్, డానీ, ప్రవీణ్, రిషి, నిత్య, రియన్, మహిమ, అశోక్, వీరయ్య, సబితా తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మానవత్వం మిగిలే మార్గం -- సేవ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని నిలబెట్టే స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.

## క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసం - శివశంకర్‌కు ఘన సన్మానం

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్




కూకట్ పల్లి; ఏప్రిల్ 21(వాయిస్ టుడే) క్రీడలు శారీరక, మానసిక వికాసానికి మాత్రమే కాకుండా వ్యక్తుల మధ్య, రాష్ట్రాలు మరియు దేశాల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించే శక్తివంతమైన వేదికలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఇటీవల సనత్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూసాపేట హనుమాన్ వ్యాయామశాల తరఫున పాల్గొన్న ప్రతిభావంతుడు పాతపల్లి శివశంకర్ 59 కిలోల విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. ఈ విజయాన్ని పురస్కరించుకుని మంగళవారం కూకట్‌పల్లిలోని శ్రీ హేమ దుర్గా భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శివశంకర్ మర్యాదపూర్వకంగా బండి రమేష్ ను కలిశారు. ఈ సందర్భంగా రమేష్ శాలువాతో శివశంకర్ ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "యువత క్రీడలపై దృష్టి పెట్టడం ఎంతో అవసరం. శివశంకర్ లాంటి క్రీడాకారులు మరిన్ని పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, శ్రీనివాస్, రామారావు, అక్బర్, నరేందర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో శివశంకర్ సాధించిన ఈ విజయంతో ప్రాంతీయ యువతలో క్రీడలపై మరింత ఉత్సాహం పెరిగిందని చెప్పవచ్చు.

# కాంగ్రెస్ పార్టీ నిర్ణయాల వల్ల బడుగు బలహీన వర్గాలకు అన్యాయం

## బీజేపీ నాయకుడు రామకృష్ణ...



సికింద్రాబాద్, ఏప్రిల్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ నిర్ణయాల వల్ల మహిళలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ నాయకుడు జె. రామకృష్ణ మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా ప్రతి పార్టీలో పనిచేస్తున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనికోసం ప్రతి కార్యకర్త పార్టీలకి అతీతంగా పోరాడాలన్నారు.. ఈ మేరకు మంగళవారం మహేంద్ర హిల్స్ లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డీ లిమిటేషన్ వల్ల నూతనంగా అసెంబ్లీ స్థానాలు పెరిగి, నూతన ఆశావాహులకు అవకాశం దక్కేదన్నారు. కాంగ్రెస్, దాని అనుబంధ పార్టీలు డీలిమిటేషన్ ప్రక్రియను అడ్డుకోవడం వల్ల ఆ అవకాశం లేకుండా పోయిందన్నారు. డీ లిమిటేషన్ ను అడ్డుకున్న కాంగ్రెస్ దాని అనుబంధ పార్టీలు తీరు మార్చుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మోడీ పాలనలో తీసుకున్న డీ లిమిటేషన్ కారణంగా వివిధ రాజకీయ పార్టీలలో పని చేస్తున్న సామాన్య కార్యకర్తలకు కూడా అవకాశాలు లభిస్తాయని చెప్పారు. స్థానాలు పెరగడం వల్ల ఆశావాహులకు అవకాశం దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ పార్టీలు డీ లిమిటేషన్ బిల్లు ను వ్యతిరేకించడం వల్ల ఆ అవకాశం లేకుండా పోయిందన్నారు.

డీలిమిటేషన్ జరిగితే ఏళ్ల తరబడి అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ, ఎస్టీ ,బీసీ బిడ్డలకు రాజకీయాలలో ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉండేదన్నారు. కాంగ్రెస్ దాని మిత్ర పక్షాల నాయకులు కేవలం వారి కుటుంబ సభ్యుల కోసం, ఆర్థికంగా బలంగా ఉన్న భూకబ్జాదారులు, వ్యాపారులకు మాత్రమే టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దశాబ్దాలుగా పార్టీ జెండాలు మోస్తున్న నిజమైన కార్యకర్తలకు మాత్రం అన్యాయం జరుతోందన్నారు.. కార్యకర్తలు కేవలం మీటింగులకు కుర్చీలు వేయడానికే పరిమితం కాకూడదని, పార్టీలకు అతీతంగా అందరూ ఏకమై తమ హక్కుల కోసం తిరుగుబాటు చేసి నాయకులను నిలదీయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.





# సభ్యుల ఐక్యతకు నిదర్శనం: బాలానగర్ మైక్రో స్మాల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక"

### – అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అంబటి సునీల్ కుమార్ గుప్తా, ఎండి.ఖాజా

కూకట్ పల్లి; ఏప్రిల్ 21(వాయిస్ టుడే): బాలానగర్ పరిశ్రమల వర్గాల్లో కీలకమైన సంస్థగా పేరొందిన బాలానగర్ మైక్రో స్మాల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా పారదర్శకంగా జరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో అధ్యక్షుడుగా అంబటి సునీల్ కుమార్ గుప్తా, ఉపాధ్యక్షుడుగా బి.వి.వి బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా ఎండి ఖాజా, కోశాధికారిగా ఎన్.వి రత్నం, జాయింట్ సెక్రటరీగా జే. రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బి. మోతిలాల్, వరప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు శోభన కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులుగా ప్రసాద్, అనిల్, బి.వి.ఆర్ రెడ్డి వ్యవహరించగా అడ్వకేట్ కే. రవి సూచనలు, మార్గదర్శకత్వంలో ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 8 నుంచి 14 వరకు నామినేషన్ల స్వీకరణ ఏప్రిల్ 15తో ఉపసంహరణ ప్రక్రియ మూస్తుంది. అదేవిధంగా ఏప్రిల్ 21న ఎన్నికల నిర్వహణ ఒకే ప్యానెల్ మాత్రమే పోటీలో నిలవడంతో ఎవరూ ప్రత్యర్థులుగా నామినేషన్లు వేయకపోవడం వల్ల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. కమిటీలో మొత్తం సభ్యులు 144 మంది ఎన్నికల్లో పాల్గొనగా 109 మంది నూతన కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అంబటి సునీల్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజా, కోశాధికారి ఎన్.వి రత్నం మాట్లాడుతూ త్వరలో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేసి అసోసియేషన్‌ను మరింత సమర్థవంతంగా నడిపిస్తూ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సభ్యుల ఐక్యతకు నిదర్శనమని బాలానగర్ పరిశ్రమల అభివృద్ధికి నూతన కమిటీ కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేసింది.



## ఫీజు రియంబర్స్ మెంట్ ఎత్తివేసే కుట్ర మానుకోవాలి

### తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 21: విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ ఎత్తివేసే కుట్రను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో విద్యార్థి నేతలు సంజయ్ (ఓయు), ఉమేష్ (వెటర్నిటీ), వంశీ (అగ్రికల్చర్) పాపారావు (తెలంగాణ), మహేందర్ (కాకతీయ), అజయ్ (నిజాం), రాకేష్ (సెంట్రల్ యూనివర్సిటీ) తో కలిసి ఆయన మాట్లాడుతూ... ఫీజులు కట్టలేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, మానసిక వేదనకు గురవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని. విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని అంటున్నాయని, ఇటు కాలేజీ యాజమాన్యల ఒత్తిడి, అటు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మధ్య పేద విద్యార్థుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు జీతాలు ప్రతి నెలా వేల కోట్లు మంజూరవుతున్నా, విద్యార్థుల పీజు రియంబర్స్ మెంట్ బిల్లులు మాత్రం మంజూరు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తిరగబడితే ప్రభుత్వాలే కూలిపోయే పరిస్థితి ఉంటుందని ఆ పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి రాకూడదని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఫీజు రియంబర్స్ మెంట్ చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే విద్యార్థి ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## క్షణాల్లో కుటుంబం ఛిన్నాభిన్నం

### తండ్రి, కుమారుడి దుర్మరణం.. తల్లి, కుమార్తెకు గాయాలు



ఆదిభట్ల: దైవ దర్శనానికి బయల్దేరిన ఓ కుటుంబం క్షణాల్లో రక్తపు మడుగులో కూలిపోయింది. కుటుంబ యజమాని రోడ్డుపైనే విగతజీవిగా పడిపోగా.. తీవ్రగాయాలతో కుమారుడు డాడీ డాడీ అంటూ ఆర్తనాదాలు చేయడం కన్నీరు పెట్టించింది. గాయాలతో విలవిల్లాడుతున్న తల్లి.. తన కుమారుడికి ఏమైందంటూ తల్లడిల్లిన దృశ్యం హృదయాలను కలిచివేసింది. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీకొట్టిన ప్రమాదంలో ఘటనాస్థలం వద్ద కనిపించిన హృదయవిదారకమైన దృశ్యాలివి. ఈ ఘటనలో తండ్రి, కుమారుడు మృతి చెందారు. ఆదిభట్ల సీఐ రవికుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన కొమ్మగోని ప్రశాంత్ గౌడ్(41) లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. భార్య వాణి, కుమారుడు శ్రీతన్(11), కుమార్తె శశికతో కలిసి మంగళవారం ఉదయం రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ దర్శనం కోసం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. రావిర్యాల వండర్‌లా సమీపంలో సర్వీస్ రోడ్డుపై ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని డీసీఎం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడు శ్రీతన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. వాణికి కుడి కాలు విరిగి తలకు తీవ్ర గాయాలయ్యాయి. శశికకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం వాణి మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న డీసీఎం డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

**ఆసుపత్రి నుంచే ఆఖరి చూపు..**

తీవ్రగాయాలై పుట్టెడు బాధతో ఉన్న వాణి.. భర్త, కుమారుడి మృతదేహాలను ఆసుపత్రి నుంచే చూడాల్సి వచ్చింది. ప్రశాంత్ గౌడ్, శ్రీతన్ మృతదేహాలను పోస్ట్‌మార్టం అనంతరం ఉస్మానియా ఆసుపత్రి నుంచి సాహెబ్‌నగర్‌కు తీసుకెళ్లే క్రమంలో మలక్‌పేట యశోదా ఆసుపత్రి వద్దకు తీసుకెళ్లారు. అక్కడే వాణి తన భర్త, కుమారుడిని చివరి చూపు చూడడం అందరిని కలిచివేసింది.

# అరుంధతి మాదిగ కుల సంఘం ఆధ్వర్యంలో 'దళిత రత్న" అవార్డు గ్రహీతలకు సత్కారం

### ఘనంగా బాబూ జగజీవన్ రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు



హనుమకొండ, ఏప్రిల్ 21: 'అరుంధతి" మాదిగ కుల సంఘం అధ్యక్షులు బొడ్డు దేవయ్య ఆధ్వర్యంలో భారత సామాజిక న్యాయ పోరాట యోధులు బాబూ జగజీవన్ రామ్ 118వ జయంతి, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయుల సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బొడ్డు దేవయ్య, ముఖ్య సలహాదారు పసునూరి మనోహర్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం బాబూ జగజీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ రాజకీయాల్లో ఉన్నత స్థానాలను అలంకరించినప్పటికీ పేదల, కార్మికుల, దళితుల సమస్యలపై ఎల్లప్పుడూ పోరాడిన మహానేతగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన మహనీయుడని, విద్య, హక్కులు, స్వాభిమానమే దళితుల అభ్యున్నతికి ఆయుధాలని బోధించిన దార్శనికుడని అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు అంబేద్కర్ చూపిన మార్గం నేటికీ మార్గదర్శకమని తెలిపారు.

ఇప్పటి యువత మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్య, ఉద్యోగం, సామాజిక చైతన్యం, ఐక్యత దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దళితులు ఆత్మవిశ్వాసంతో ఎదిగి ప్రతి రంగంలో ప్రతిభ చాటాలని, సామాజికంగా సంఘటితమై హక్కుల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా ఇటీవల దళిత రత్న పురస్కారం అందుకున్న నలుగురు ప్రముఖులు బొడ్డు దేవయ్య, గబెట్టా శ్రీను, కొడవటి రవి, బొల్లా కుమార్ లను అరుంధతి మాదిగ కుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి వారి సేవలను ప్రశంసించారు.

సమాజ సేవ, దళితుల సంక్షేమం, యువతలో చైతన్యం, విద్యా ప్రోత్సాహం, ప్రజా సమస్యల పరిష్కారంలో వారు చేస్తున్న కృషి అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. సమాజానికి సేవ చేసిన వారిని గౌరవించడం ద్వారా మరింత మందికి ప్రేరణ కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఆర్ఎల్వై నాయకులు సిరిసపెల్లి రవీందర్, ఆరూరి సాంబయ్య కూడా అవార్డు గ్రహీతలను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మహనీయుల ఆశయాలు, సామాజిక ఐక్యత, సేవా భావం ప్రతిఫలించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. అరుంధతి సంగం సభ్యులు గాజుల విజయ్, కావంపల్లి మోహన్,నాధునూరి రాజేశ్వర్ రావు.. సారయ్య.. సంగమయ్య.. దేవదాస్.. భోజపల్లి నర్సింగ్, కాదశి లక్ష్మణ్, శామ్యూల్, లక్ష్మణ్, మదాసి లవ్యణ్య, పోగుల సరమ్మా,బొడ్డు సంగం యువత...దామోదర్, ఓనపాక అనిల్, చిన్న పాల్గొన్నారు.



### ముంబైలో చారిత్రాత్మక భేటీ

## అంబేద్కర్ మనవడు భీమ్‌రావ్ అంబేద్కర్‌తో కర్క నాగరాజు సమావేశం

కూకట్ పల్లి; ఏప్రిల్ 21(వాయిస్ టుడే): ముంబై నగరంలోని దాదర్‌లో ఈ రోజు ఒక ప్రాధాన్యతగల, ప్రేరణాత్మక సంఘటన చోటుచేసుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, ప్రముఖ కార్మిక నాయకుడు కర్క నాగరాజు తన ఉద్యమ యాత్రలో భాగంగా ముంబైకు విచ్చేసి, భారత రాజ్యాంగ నిర్మాత రెండవ మనవడు, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ భేటీ ముంబైలోని అంబేద్కర్ భవన్‌లో, ప్రబుద్ధ ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కర్క నాగరాజు భీమ్‌రావ్ అంబేద్కర్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సమావేశం ఆత్మీయతతో, భావోద్వేగంతో నిండిపోయింది. ఈ సందర్భంగా నాగరాజు తెలంగాణ రాష్ట్రంలో తాను చేపడుతున్న పూలే--అంబేద్కర్ భావజాల ఉద్యమ కార్యక్రమాల గురించి వివరంగా తెలియజేశారు. సమానత్వం, సామాజిక న్యాయం, దళితుల సాధికారత కోసం జరుగుతున్న ఈ కార్యక్రమాలపై భీమ్‌రావ్ అంబేద్కర్ సానుకూలంగా స్పందించి, నాగరాజు కృషిని అభినందించారు. వారి భుజాన్ని తట్టి ప్రోత్సహిస్తూ, తెలంగాణలో జరుగుతున్న ఉద్యమ కార్యక్రమాల గురించి మరింతగా తెలుసుకున్నారు. ఈ చారిత్రాత్మక భేటీలో స్థానిక నాయకులు మరియు సామాజిక కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. భారతీయ సమాజ్ సేవా సమితి (మాదిగ–రిజి) కార్యదర్శి కేదాస్ గురునాథ్ మహరాజ్, ఎం.టి.బి.ఎఫ్ నాయకులు ఎల్ది రఘునాథ్ పద్మశాలి, మూలనివాసి మాలజీ, కర్క లోహిత్ రాజ్, కర్క కార్తీక్ రాజ్ తదితరులు హాజరై ఈ సంఘటనకు మరింత ప్రాధాన్యత చేకూర్చారు. ఈ భేటీ అంబేద్కర్ భావజాలానికి నూతన దిశగా, దేశవ్యాప్తంగా సామాజిక ఉద్యమాలకు బలాన్నిచ్చే ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.



## ఆడబిడ్డలకు వరం 'కళ్యాణలక్ష్మి'

### సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు

హైదరాబాద్, ఏప్రిల్ 21: ఆడబిడ్డల పెళ్లి ఆ కుటుంబానికి ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటోందని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యాసభ సభ్యులు వి. హనుమంతరావు అన్నారు. మంగళవారం అంబర్ పేట నియోజకవర్గంలో 400 మంది లబ్దిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్ లను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కాంగ్రెస్ నేతలు రోహిన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోత రోహిత్ లతో కలిసి ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాల కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు మాట్లాడుతూ.... ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాల్లో కళ్యాణ లక్ష్మీతో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగు నింపుతుందని అన్నారు. అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న పేదల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆహర్నిశలు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హిమాయత్ నగర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర


హిమాయత్ నగర్, ఏప్రిల్ 21: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం హిమాయత్ నగర్ డివిజన్ లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వీధి దీపాలు వెలగడం లేదని, మంచినీరు నల్లాల్లో సరిగ్గా రావడం లేదని, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. గుంతలు పడ్డ రోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్ల మర్మతు పనులు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని, సమస్యలను పరిష్కరించే విధంగా తగుచర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో హిమాయత్ నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ డాక్టర్ గణేష్ గౌటే, బీజేపీ నాయకులు నర్సింగ్ గౌడ్, కాంగ్రెస్ నేతలు రాజేంద్రప్రసాద్, అనీష్ గంగపుత్ర, ప్రభాకర్ గౌడ్, యాదగిరి, భాను, తదితరులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
బుధవారం 22 ఏప్రిల్ 2026

# దాతలు, భక్తులు ఇచ్చే విరాళాలు మరకత శివాలయం అభివృద్ధి కొరకే

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ముత్యాల మల్లేష్ యాదవ్ నియామకం

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపిన మల్లేష్ యాదవ్



సైదాపూర్(వాయిస్ టుడే):కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా సైదాపూర్ మండలం పెరుకపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల మల్లేష్ యాదవ్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు మేడిపల్లి సత్యం నియామకపు పత్రం జారీ చేశారు.కాంగ్రెస్ పార్టీ అభివృద్దే లక్ష్యంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు నమ్మిన బంటుగా ఉంటూ నిరంతరం తనదైన మార్క్ తో పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నన్న ముత్యాల మల్లేష్ యాదవ్ సేవలను గుర్తించిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించేందుకు కృషి చేశారు.పార్టీలకు అతీతంగా,ఎలాంటి పైరవీలకు తావులేకుండా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తుందని మల్లేష్ యాదవ్ తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని సంక్షమా పథకాలను ప్రతి గడపకు తీసుకెల్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు.తన నియమాకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు,జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యంకు మల్లేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.మల్లేష్ యాదవ్ నియామకంతో మండలంలోని వివిధ గ్రామాల్లో తన అభిమానులు పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.



## మంచు పర్వతాలపై కూచిపూడి నృత్యం హర్షణీయం

### ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 21: నిర్మల్ పట్టణం భాగ్యనగర్ కు చెందిన వరణ్య అనే చిన్నారి 4000 అడుగుల ఎత్తైన మంచు పర్వతంపై -4 ఢీజ లో కూచిపూడి నృత్యం చేయడం గొప్ప విషయమని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిన్నారిని అభినందించి శాలువాతో సత్కరించారు. జమ్మూ కాశ్మీర్ లోని బారాముల జిల్లా గుల్మార్గ్ ప్రాంతంలోని ఆఫర్వాత్ పర్వతంపై విఘ్నరాజం భజే" అంటూ కూచిపూడి నృత్యం చేయడం జరిగిందని, రాబోవు రోజుల్లో మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి నిర్మల్ కీర్తి ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖమ్మం సురేందర్, మాజీ ఎంపీపీ రమేష్, నాయకులు రాజేశ్వర్, జీవన్ రెడ్డి, మల్లేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనారోగ్యంనుండి త్వరగా కోలుకోవాలని ఖాశిం మెగాఫ్యాన్స్ ప్రత్యేక పూజలు

పాల్వంచ : ఏప్రిల్ 21 (వాయిస్ టుడే ): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలని బుధవారం పాల్వంచ లక్ష్మీదేవి పల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో ఖాసింమెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ప్రత్యక పూజలు చేసారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని మనస్పూర్తిగా ఆ దేవుని కోరుకున్నానని అన్నారు. అలాగే పాల్వంచ జనసేన పట్టణ అధ్యక్షులు వీరబ్రహ్మం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో కలకాలం ఉండాలని ఆయనకు దేవుడు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాసిం, భాషా, వీర , బ్రహ్మం , సాయి తేజ , బాలాజీ హరీష్ , గురు, సాయి ,దుర్గాప్రసాద్, సారయ్య ,సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన సందస్సు

మహబూబ్నగర్ జిల్లా ఏప్రిల్ 21 : జడ్చర్ల /నవాబు పేట్/ రాజాపూర్/పలు మండలాల్లో పోషణ్ మాహ్ కార్యక్రమం సందర్భంగా రాజాపూర్ గ్రామపంచాయతీ లో అవగాహన సదస్సు నిర్వహించారు. 6 నెలల వరకు తల్లిపాలు మరియు 6 నెలల తర్వాత ఘనహారం ఇవ్వడంపై అధికారుల సూచనలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని 3 నుండి 5 సంవత్సరాల పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిపారు పిల్లల తల్లిదండ్రులకు అంగన్వాడి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, విజయలక్ష్మి వైద్య అధికారి, శోభారాణి, సీడీపీవో నర్మద, రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచి రామకృష్ణ అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### దేవాదాయ శాఖకు ప్రతి రూపాయి లెక్క చూపిస్తాం: ఆలయ ధర్మకర్త వెంకటేశ్వరరావు



చేవెళ్ల...ఏప్రిల్ 21(వాయిస్ టుడే) శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 15 రోజుల కింద దేవాదాయ శాఖ వారు ఆలయానికి చెందిన ఐదు సంవత్సరాల లెక్క చూపమని నోటీసులు ఇచ్చి వెళ్లారని తెలిపారు. తాము వారిని మూడు నెలల గడువు కోరామని అడిగినట్టు చెప్పారు. ఆలయంలో ఎలాంటి దుర్వినియోగం జరగలేదని చెప్పారు. 1983లో తాను శంకర్‌పల్లికి వచ్చానని, మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో పురాతన ఆలయం ఉందని తెలుసుకొని 2012లో ఆలయాన్ని గ్రామస్తులతో కలిసి పున:నిర్మించామని తెలిపారు. 2018 నుండి 2023 వరకు చైర్మన్‌గా సదానందం గౌడ్ ఉన్నప్పుడు ఆలయంలో ఉన్న అర్చకులకు పనిచేసే వారికి జీతాలు కూడా ఇవ్వడానికి కష్టంగా ఉండేదని, 2020-21లో కోవిడ్ రాగ ఆ సమయంలో ఆలయానికి భక్తులు రాలేక చాలా ఇబ్బందులు పడ్డామని వాపోయారు.

ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా కలిసి చందాలు వేసుకొని ప్రతి పౌర్ణమికి అన్నదానం చేసే వారిమని చెప్పారు. 2024 నుండి భక్తులు పెరగడం, దాతలు ఇచ్చే విరాళాలతో ప్రతి ఆది, సోమ వారాలు, పౌర్ణమికి అన్నదానం చేస్తున్నామని తెలియజేశారు. శివరాత్రి పండగకు, కార్తీక మాసంలో వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలు లేక ఉండడానికి వసతి గృహాలు లేక, భక్తులు నానా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ సహకారంతో ఎనిమిది వందల గజాలు తీసుకొని అన్నదాన సత్రం, వసతి గదులను నిర్మించామని తెలిపారు. గదుల నుండి వచ్చే రుసుమును ఆలయ అభివృద్ధికి వాడుతున్నామని పేర్కొన్నారు. ఆలయం ప్రతి ఒక్కరిదని, ప్రతి ఒక్కరూ ఆలయానికి రావచ్చుని, స్వామివారికి దర్శనం, అభిషేకాలు చేసుకోవచ్చని తెలియజేశారు. స్వామివారి అభిషేకానికి టికెట్టు, అన్నదానానికి కూడా రసీదును భక్తులకు ఇస్తున్నామని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోరిక మేరకు లడ్డు, పులిహోర అందజేస్తున్నామని చెప్పారు. ఆలయానికి వివిధ విభాగాల నుండి వచ్చే ప్రతి రూపాయికి లెక్క ఉందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, కోశాధికారి జనార్ధన్, మాజీ చైర్మన్ సదానందం గౌడ్, మాజీ వైస్ చైర్మన్ హన్మంతు, కమిటీ సభ్యులు దేవేందర్ రెడ్డి, సాగర్, సుధీర్ గౌడ్, లీలావతి, విట్టలయ్య, అనంతయ్య, వెంకటస్వామి, నవీన్, అర్చకులు సాయి శివ ప్రసాద్, వీరేష్ ఉన్నారు.

## గోప్లాపూర్ గ్రామం సందర్శించిన విద్యుత్ శాఖ అధికారులు



జడ్చర్ల ఏప్రిల్ 21 (వాయిస్ టుడే) : మండల పరిధిలోని గ్రూఫ్లో పూర్ గ్రామం మంగళవారం విద్యుత్ శాఖ ఏ ఈ వీరన్న, లైన్మెన్ కృష్ణయ్య గ్రామంలో గ్రామ సర్పంచ్ తో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకుల తో కలిసి గ్రామంలో అన్ని కాలనీలు సందర్శించి. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా కొత్త విద్యుత్ స్తంభాలు కొత్త లైన్లు ట్రాన్స్ఫార్మర్ల అవసరాన్ని గుర్తించారు. గ్రామమంతా తిరిగి పరిశీలించి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను గుర్తించడం జరిగింది. త్వరలోనే విద్యుత్ పనులను ప్రారంభిస్తామని ఏఈ లైన్మెన్ గ్రామ సర్పంచ్ గ్రామ నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరోగ్యమ్మ మార్కెట్ డైరెక్టర్ కృష్ణయ్య,మాజీ సర్పంచ్ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ టీ. చెన్నయ్య, వార్డు మెంబర్స్ సామెల్, విలేజ్ సెక్రటరీ శివ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అంజి, తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన నాయకులు

మెటుపల్లి, ఏప్రిల్ 21 (వాయిస్ టుడే) : జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలోని పురాతనమైన కాశి బాగ్ హనుమాన్ ఆలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ తొందరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ...జనసేన పార్టీ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో పవన్ కళ్యాణ్ తొందరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొందరగా పవన్ కళ్యాణ్ కోలుకొని ప్రజాసేవ చేయాలని జనసేన నాయకులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గంగం అజయ్,కడారీ శ్రీకాంత్,కడారీ చంద్రశేఖర్, ఎలుగందుల షామిలి, రాజేశ్వర్,మణిప్రీతం తదితర జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అవినీతిని బయట పెట్టినందుకు గ్రామపంచాయతీ వార్డు సభ్యునీపై దాడి

## కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి ఫిర్యాదు



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 21: ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని ఫిర్యాదు చేసినందుకు లక్ష్మణ చందా మండలంలోని వడ్యాల్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు లిపుట్టి సాగర్ పై దాడిలి చేసి న ఏంచెట్టి శ్రీనివాస్ చౌక్కా చింపేసిన పెత్తందారులు లిఏంచెట్టి శ్రీనివాస్, ఆకుల రమణ, ఠాకూర్ కిరణ్ సింగ్‌లి .ఈ ముగ్గురు పనికి రాకుండానే ఉపాధి హామీలు డబ్బులు తీసుకుంటున్న వ్యక్తులు.

ఈరోజు గ్రామపంచాయతీ సర్పంచ్ పసుపుల నరేష్ వార్డు సభ్యుడు అయినటువంటి పుట్టి సాగర్ గారిని ఉపాధి హామీ పనులు నిర్వహించేటటువంటి చోట ఫోన్ ద్వారా పిలిచాడు అక్కడ జమగూడి ఉన్న ఉపాధి హామీ కూలీలు మరియు కూలి పని చేయకుండానే లబ్ధి పొందుతున్న వారు పుట్టి సాగర్ పై దాడి చేశారు. చౌక్కా చింపారు. ఈ సంఘటనపై ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగింది. లక్ష్మణ్ చందా మండలంలోని వడ్యాల్ ,పీసరా గ్రామాలలో ఉపాధి పనులలో అవినీతి జరుగుతుందని గ్రీవెన్స్ లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 10 రోజుల క్రితం ఫిర్యాదు చేయడం జరిగింది. ఆ ఫిర్యాదు నువ్వే చేయించావని గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పుట్టి సాగర్ (రెండుసార్లు అధిక మెజార్టీతో గెలిచిన వార్డు సభ్యుడు) గత సంవత్సరము సరియైన వేతనం చెల్లిస్తాము వారానికి 100 ఇవ్వండని మా గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వసూలు చేస్తున్నాడనీ పిడి కి ఫిర్యాదు చేయడం జరిగింది .ఈ పీడీ గారు దీనిపై విచారణ జరపలేదు .ఎలాంటి యాక్షన్ తీసుకోలేదు. ఈ సంవత్సరము ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. గత సంవత్సరం జరిగిన అవినీతికి ఈ సంవత్సరం జరుగుతున్న అవినీతికి చాలా తేడా ఉంది. గత సంవత్సరం ఫోటోలు దిగే కార్యక్రమం లేదు. ఈసారి ఫోటోలు దిగి అవినీతి లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణయం చేస్తే ఫోటోలు దిగి ఏ పని చేయకుండానే డబ్బులు తీసుకునే పద్ధతిని మా గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మరియు కొంతమంది పెత్తందారులు కలిసి నిర్ణయం చేశారు. దీనిని నేను వ్యతిరేకించినందుకు వార్డు సభ్యుడునైనా నాపై దాడి చేశారని పుట్టి సాగర్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆశ్రయించడం జరిగింది .జరుగుతున్న అవినీతి నరికట్టాలని పుట్టి సాగర్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవో కి దరఖాస్తు ఇవ్వడం జరిగింది. పిడి విజయలక్ష్మి అవినీతిని ప్రోత్సహిస్తూ గ్రామాలలో పనులు చేయకుండానే ఫోటోలు దిగిపోతుంటే సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు ప్రజలందరూ కలిసి బహిరంగర బహిరంగ సత్యాన్ని రహస్యం చేసి అందరూ కలిసి ఉపాధి పనులు జరిగే తీరునే మార్చేశారు. ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతినీ అరికట్టాలని ఉపాధి హామీలు అవినీతి జరగడానికి కారకురాలైన డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి గారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వడం జరిగింది .ప్రియమైన ప్రజలారా వ్యవసాయ కూలీలకు పని కల్పించాలని వచ్చిన చట్టాన్ని కొంత మంది పెత్తందారులు గ్రామాలలో పెత్తనం చెలాయిస్తూ పనులు చేయకుండానే డబ్బులు తీసుకోవడానికి రుచి మరిగిన వీరు పనులు చేయకుండా ఫోటోలు దిగి గ్రూపు లీడర్ల ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్కు వారానికి 300 రూపాయలు చెల్లించి వేతనాలు పొందడం కోసం కష్టజీవులైనటువంటి పేదలకు పనులు లేకుండా చేయడం కోసం కుట్ర చేస్తున్నారు. పనిచేయకుండానే డబ్బులు సంపాదించడం కోసం కుట్రలు చేస్తున్నారు. పెత్తందారుల కుట్రలను పేదలు పసిగట్టాలని కష్టపడి పని చేయడం సరైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేయడం కూలీల హక్కు. పెత్తందారుల మాటలు విని పేదలకు నష్టం చేసేటటువంటి పనులు కష్ట జీవులైన వ్యవసాయ కూలీలు చేయకూడదని విజ్ఞప్తి చేస్తున్నాం. ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని రోజు కూలి 800 రూపాయలు చెల్లించాలని గడ్డపార,తట్ట ,పార కొనుగోలు చేసి ఇవ్వాలని సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని 800 రూపాయల కూలి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు . వెంటనే అవినీతి అధికారులపై చర్యలు తీసుకొని ఉపాధి హామీ పని కూలీలందరికీ దక్కే విధంగా గ్రామాలలో పనులు చేయించాలని కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లిదుర్గం నూతన్ కుమార్ జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతిలి జిల్లా ఉపాధ్యక్షులు లిబర్కుంట గంగారంలి మరియు బాధిత వ్యవసాయ కూలీ వడ్యాల్ గ్రామపంచాయతీ కి రెండుసార్లు మెజారిటీతో ఎన్నికైన లిపుట్టి సాగర్‌లి పాల్గొన్నారు.

# గన్నవరంలో ఘనంగా సీఎం చంద్రబాబు 76వ పుట్టినరోజు వేడుకలు

## సోమవారం రాత్రి దద్దరిల్లిన గన్నవరం



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు గన్నవరం లోని మర్లపాలెం గ్రామంలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం 76 కిలోల భారీ కేక్‌ను కూటమి నాయకులతో కలసి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్లపాలెం వద్ద రూ.74 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే, గతంలో వివాదాలతో నిలిచిన గన్నవరం ఇప్పుడు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఐటీ రంగానికి పునాది వేసిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు . బిల్ గేట్స్ వంటి ప్రముఖులు కూడా చంద్రబాబు ప్రతిభ ను మెచ్చుకున్నారని పేర్కొన్నారు. క్వాంటం వ్యాలీ వంటి ప్రాజెక్టులను అమరావతి తో పాటు గన్నవరం మేధా టవర్స్ కు తీసుకువచ్చారని తెలిపారు. సీఎం సతీమణి నారా భువనేశ్వరి అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల విరాళం అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, గన్నవరం ఏ.యం.సి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, టిడిపి నాయకులు దయాల రాజేశ్వరరావు, గూడపాటి తులసిమోహన్, కొలుసు రవీంద్ర, గొడ్డళ్ల చిన్న రామారావు, జాస్తి శ్రీధర్, మూల్పూరి సాయి కళ్యాణి, దొంతు చిన్నా, మొవ్వ వెంకటేశ్వరరావు, పొదిలి లలిత, కంభంపాటి లక్ష్మీనరసమ్మ, జొన్నలగడ్డ సుధాకర్, గండేపూడి నితీష్, బెజవాడ నాగేశ్వరరావు, బోడపాటి రవి, మేడేపల్లి రమ, మోదుగుమూడి సత్యనారాయణ, గుజ్జర్లపూడి బాబురావు, సర్నాల బాలాజీ, బుస్సే నాగప్రసాద్, తుమ్మల లత, నెక్కంటి శ్రీదేవి, గరికపాటి నాగలక్ష్మి, బుస్సే సరిత, తులిమెల్లి ఝాన్సీ, కానూరి శేషు మాధవి, చిమట రవివర్మ, షేక్ ఫిరోజ్, చల్లగుల్ల సందీప్, పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం, గండికోట సీతయ్య, కొల్లా ఆనంద్, అడుసుమిల్లి నవీన్, అన్నే హరికృష్ణ, తంగిరాల శ్రీనివాసరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, కొమ్మారెడ్డి రాజేష్, సందీప్, అరికట్ల రవి, యనమదల సతీష్, బండి భాస్కర్, మల్లారెడ్డి కిషోర్ మరియు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## పేద రోగులకు అండగా నిలుస్తూ ఎల్‌ఓసి పత్రాలు అందజేత

ఇందూరు: పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని అవసరమైన వారికి నిమ్స్ లో ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం పలువురికి ఎల్ వోసీ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నియోజక వర్గంలో అర్హులైన పేదలకు ఎల్ వోసీ ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని గాయత్రి నగర్ కు చెందిన పెంటయ్య నరాల సంబంధిత వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే సబ్బని శ్రీనివాస్ మూత్ర పిండాల సంబంధిత వ్యాధితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఇరువురికి కలిపి రూ. 6 లక్షల ఎల్ వోసీ లు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా ప్రజల ప్రాణాలను కాపాడటమే తన కర్తవ్యం అని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రోగికి తక్షణ సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.




## హిందూ సంస్కృతిని కాపాడటం అందరి బాధ్యత

### కంఠేశ్వర్ హిందూ సమ్మేళనంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా

ఇందూరు: హిందూ సంస్కృతిని కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని కంఠేశ్వర్ ఆలయం లో మంగళవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సమాజంలో కొన్నిసార్లు చిన్న విభేదాలతో కులం , ప్రాంతం, భాష మనల్ని విడదీస్తున్నాయన్నారు. ఇవి హిందూ సమాజానికి బలహీనతలు కావాలి అన్నారు. అలాగే ఆర్ ఎస్ ఎస్ నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాల్లో వక్తలు చెబుతున్న మాటలను శ్రద్ధగా విని పాటించాలన్నారు. కార్యక్రమంలో వక్త కల్వగురి ప్రభుకుమార్, పలుగుట్ట ఆశ్రమ కేదారానంద స్వామీజీ, సేవికా సమితి బౌద్ధిక్ ప్రముఖ్ కల్పన, హిందూ సమ్మేళనం కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగోళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 30న మట్టపల్లి రజక అన్నదానసత్రంలో మహా అన్నదానం

హుజూర్‌నగర్, ఏప్రిల్, 21 (వాయిస్ టుడే ప్రతినిధి): ఏప్రిల్ 30 న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం సందర్భంగా మట్టపల్లి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు రజక అన్నదాన సత్రంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు పిల్లుట్ల కృష్ణయ్య తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణంలో చిలకరాజు దశరథ నివాసంలో మంగళవారం జరిగిన మట్టపల్లి రజక సత్రం కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా స్వామి వారి కళ్యాణం సందర్భంగా రజక కుల బంధువుల సహకారంతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో రజక కులస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అన్నదాన కార్యక్రమం కు సత్రం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు మాజీ ఎంపీపి గూడెపు శ్రీనివాస్, రేపాకుల కోటయ్య దుగ్గి వర్మ ఉద్దగిరి శ్రీనివాస్, గూడెపు నాగలింగం, ఇందిరాల రామకృష్ణ, తాడికొండ కిషోర్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం డిపో నందు గేట్ మీటింగ్

ఖమ్మం, ఏప్రిల్ 21( వాయిస్ టుడే) : ఖమ్మం ఆర్టీసీ డిపో ముందు గేటు మీటింగ్లో ఖమ్మం రీజియన్ జెఎసి చైర్మన్ పిల్లి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టో పెట్టినటువంటి అంశాలను అమలు పరచాలని పే స్కేలును అమలు పరచాలని, ప్రభుత్వంలో ఆర్టీసీ నీ వీలినం చేయాలని, యూనియన్లను ఆర్టీసీలో పునరుద్ధరించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ కి అప్పుజెప్పాలని, బెడ్ విన్నర్ స్కీం లను రెగ్యులర్ ప్రతిపాదికన నిర్వహించాలని, పెండింగు ఏరియస్ బకాయిలను వెంటనే ఇవ్వాలని ,,, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని.... వివిధ 32 అంశాలపై జేఏసీ పెట్టిన డిమాండ్లను అమలు పరచాలని ఈరోజు గేటు మీటింగ్ లో సమ్మెకు సిద్ధం చేయుటకు కార్మికులను చైతన్యం చేయడం జరిగినది.. ఈ యొక్క కార్యక్రమంలో ఖమ్మం జేఏసీ నాయకులు పిల్లి రమేష్ గారు, చావ రమేష్, దానయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్లు, భవాని, మల్లికాంబ, గోవిందమ్మ, సుజాత యాదగిరి, నాగేశ్వరరావు తదితర కార్మిక నాయకులు ,కార్మికులు పాల్గొనడం జరిగింది.... ప్రతి ఒక్కరూ కూడా సమ్మెకు సిద్ధమంటూ ప్రతిజ్ఞ చేయడం జరిగింది.



## రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

మిర్యాలగూడ ఏప్రిల్ 20 (వాయిస్ టుడే): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మ్యాచరు వచ్చే విధంగా చూసుకుని ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులకు సూచించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, వ్యవసాయ అధికారి రూసెంద్రమని తదితరులున్నారు.



## వేసవి ఎద్దడి గురించి తగు సూచనలు ఇచ్చిన కేసరపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసాద్

కృష్ణాజిల్లా-గన్నవరం (వాయిస్ టుడే): గన్నవరం మండలం,కేసరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి సి.వి.ఎల్.ఆర్. ఎస్.వి.ప్రసాద్ శానిటేషన్ సిబ్బందికి వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సిబ్బంది ఆరోగ్యం రీత్యా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎద్దడి కారణంగా కేసరపల్లి గ్రామపంచాయతీ శానిటేషన్ సిబ్బంది ఆరోగ్య దృష్ట్యా పని సమయములు ఉదయం 6 గంటల నుండి 10:30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 6 గంటల వరకు పారిశుద్ధ్య కార్మిక సిబ్బంది పని వేళలు మార్పులు చేశామని, అదేవిధంగా ప్రభుత్వం నుండి వచ్చే ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ గురించి వివరించి తగు సూచనలు ఇచ్చామని తెలిపారు.

## మిర్యాలగూడ డీఎస్పీగా తుమ్మ ఆనంద్ రెడ్డి



మిర్యాలగూడ ఏప్రిల్ 20 (వాయిస్ టుడే): మిర్యాలగూడ డిఎస్పీగా తుమ్మ ఆనంద్ రెడ్డి నియమితులయ్యారు. వికారాబాద్ ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను మిర్యాలగూడ డీఎస్పీగా నియమిస్తూ డీఐజీ బి. శ్రీధర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ రాజును సీఐడీ విభాగానికి డిఎస్పీగా బదిలీ చేశారు. కాగా ఆనంద రెడ్డి గతంలో దేవరకొండ డీఎస్పీగా, హాలియా, మిర్యాలగూడ సర్కిల్ సీఐగా, హాలియా ఎస్సైగా పనిచేసిన ఆనంద్ రెడ్డి నిబద్ధత కలిగిన అధికారిగా మంచి గుర్తింపు పొందారు.

## సూర్యాపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు షేక్ సైదాను సన్మానించిన జర్నలిస్ట్ పెందుర్తి సతీష్




హుజూర్ నగర్, ఏప్రిల్, 21 (వాయిస్ టుడే ప్రతినిధి): సూర్యాపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జర్నలిస్ట్ షేక్ సైదాను మంగళవారం హుజూర్ నగర్ పట్టణంలోని టీజేఏ సూర్యాపేట జిల్లా కమిటీ కార్యాలయంలో జర్నలిస్ట్ పెందుర్తి సతీష్,కుటుంబ సభ్యులతో కలిసిపూల మాలలు వేసి ,శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెందుర్తి సతీష్ మాట్లాడుతూజిల్లాలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యూనియన్ (టీజేఏ)తెచ్చి కొద్ది కాలంలోనే సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో మరియు అన్ని మండలాలలో విస్తరించి సుమారు సగం మండలాలలో నాలుగు నియోజకవర్గాలకు టీజేఏ అధ్యక్షులను ప్రకటించడం జరిగిందన్నారు. సూర్యాపేట జిల్లాలో టీజేఏ యూనియన్ కి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ సూర్యాపేటజిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా అవకాశం ఇవ్వడం గర్వకారణమన్నారు. టీజేఏ యూనియన్ సభ్యుడిగా తాను కూడా ఉండటం గర్వంగా భావిస్తున్నానని సూర్యాపేట జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ గా ఎన్నికైన షేక్ సైదా కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సింగర్ సంధ్యా పటేల్‌ను అభినందించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



ఝరాసంగం ఏప్రిల్ 21: జహీరాబాద్ మండలంలోని అల్లిపూర్ బాల్‌నగర్ కాలనికి చెందిన సింగర్ సంధ్యా పటేల్‌ను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి సంధ్య గారికి ప్రశంసా పత్రం మరియు మేమెంటో అందజేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్.అలైవ్ కార్యక్రమంలో ఆమె పాట.మాట ప్రజల్లో ఎంతో చైతన్యాన్ని కలిగించిందని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు భద్రత, ముఖ్యంగా హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించడానికి సంధ్య పటేల్ పాటల ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా చైతన్యం అందించిందని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సందేశాత్మక పాటల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఈ సందర్భంగా సంగారెడ్డి టౌన్ ఎస్పీ కార్యాలయానికి ఆహ్వానించిన ఎస్పీ పరితోష్ పంకజ్, సంధ్యా పటేల్‌కు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా అభినందించారు.

# ఆదర్శ విద్యకు చిరునామా.. ప్రభుత్వ మోడల్ హైస్కూల్

### ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు

### కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ మోడల్ హైస్కూల్

### ఆధునిక విద్యా బోధనతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం

### ప్రిన్సిపాల్ శేషు





నాగార్జునసాగర్ ఏప్రిల్ 21 వాయిస్ టుడే : నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని ప్రభుత్వ మోడల్ హై స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా మౌలికసౌకర్యాలను కూడా విద్యార్థులకు అందిస్తున్నామని నాగార్జునసాగర్ ప్రభుత్వ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపల్ శేషు తెలిపారు. మంగళవారము మోడల్ హై స్కూల్ ప్రిన్సిపల్ శేషు వాయిస్ టుడే ప్రతినిధితో మాట్లాడుతూ అనేక విషయాలు తెలిపారు. ప్రభుత్వ మోడల్ హైస్కూల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అందు సంబంధించిన అన్ని సబ్జెక్టు టీచర్లు కూడా ఉన్నారని అన్నారు గత విద్యా సంవత్సరంలో ఎస్ ఎస్ సి లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతసాధించారని కూడా తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఆయన కోరారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మరియు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు లభిస్తాయి. విద్యార్థులకు కేవలం పాఠాలే కాకుండా కంప్యూటర్, డ్రాయింగ్,డాన్స్, కరాటే, టైలరింగ్ వంటి విద్యను అందిస్తున్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు నిపుణుల తో, అనుభవజ్ఞులైన పెద్దలతో మోటివేషన్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రాంగణ్యం మొత్తం కూడా ఎంతో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు చదువుకునే ఉన్నస స్థాయికి ఎదిగేలా పాఠశాల ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ కృషి చేస్తున్నారు. ప్రభుత్వ మోడల్ హైస్కూల్ అభివృద్ధికి నాగార్జునసాగర్ కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేత జానారెడ్డి, నాగార్జునసాగర్ శాసనసభ్యులు జైవీర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రిన్సిపల్ శేషు తెలిపారు ప్రభుత్వ మోడల్ హై స్కూల్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల అసోసియేషన్ కూడా చేయూతను అందిస్తున్నారు బిగ్ హెల్ప్ వంటి సంస్థలు కూడా ముందుకు వచ్చి విద్యార్థులకు సహకరిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు గమనించి ఈ ప్రభుత్వ మోడల్ హైస్కూల్లో తమ విద్యార్థులను చేర్పించాలని మంచి వాతావరణం లో విద్యార్థులు చదువుకున్నప్పుడు విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం కూడా ఉంటుందని ప్రిన్సిపాల్ శేషం తెలిపారు.

# ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యం

## ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్

ఖమ్మం, ఏప్రిల్ 21 ( వాయిస్ టుడే) : ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి గత ఆరు నెలలుగా జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం వల్ల విద్యార్థుల పఠన సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు స్వతంత్ర సంస్థ నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. ఈ పురోగతిపై వారు సంతోషం వ్యక్తం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పఠన సామర్థ్యం అత్యంత కీలకమని భావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పిల్లలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ నిర్వహించామని, వారానికి ఒకసారి అంచనాలు నిర్వహిస్తూ, ఫలితాల ఆధారంగా వ్యూహాలను మారుస్తూ ముందుకు తీసుకెళ్లామని అన్నారు.విద్యార్థుల స్థాయిని బట్టి ప్రత్యేక పాఠ్య సామగ్రిని రూపొందించా మని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వారికి వేర్వేరు విధానాలు అమలు చేశామని తెలిపారు.ఏఐ సాంకేతికతతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసి, ఉపాధ్యాయులపై అంచనాల భారం లేకుండా సులభంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయగలిగే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆనంద దాయకంగా రూపొందించడంతో పిల్లలు ఆసక్తిగా పాల్గొన్నారని పేర్కొన్నారు.డిసెంబర్ నెల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులకు, వెనుకబడిన విద్యార్థులకు వేర్వేరు పాఠ్య సామగ్రిని అందించామని, రోజూ పాఠశాల సమయాల్లోనే సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి రోజు ఉపాధ్యాయుల,విద్యార్థుల కార్యకలాపాలు, కథల పఠనం వంటి అంశాలతో సమగ్ర ప్రణాళికను అమలు చేశామని వివరించారు.అక్షరాలు, పదాలు, వాక్యాలు అనే మూడు స్థాయిలలో విద్యార్థుల పఠన సామర్థ్యాల అంచనా నిర్వహించామని తెలిపారు. పిల్లలు సహజంగానే ఆసక్తి కలిగినవారని, వారికి పఠనంపై నమ్మకం పెరిగితే వారు మరింత జ్ఞానం స్వయంగా సంపాదించ గలరని అన్నారు. జిల్లాలోని పలు శాఖల అధికారులు కూడా పాఠశాలలను సందర్శించి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, వెనుకబడిన మండలాలు, క్లస్టర్లలో మెరుగుదలకు సహకరించారని తెలిపారు.ఇప్పటికే విద్యార్థులకు ఒక గొప్ప నైపుణ్యాన్ని అందించామని, రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం విద్యార్థులు వాక్యాలు చదవగలిగే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. తదుపరి దశలో విద్యార్థుల పఠన వేగాన్ని పెంపొందించడం, అర్థ గ్రహణ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. నిమిషానికి 30, 40, 50 పదాలు చదవగలిగే లక్ష్యాలను నిర్దేశించి పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేసి ప్రతి విద్యార్థికి ఉపయోగపడేలా చేయాలని సూచించారు. అనంతరం ఈసిఆర్ అమలులో ఉత్తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు మెమోంటోలు అందజేసి, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా విద్యా శాఖ అధికారి చైతన్య జైనీ, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు, సంబంధిత అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




## మొక్కజొన్న కొనుగోళ్లలో షరతులు వద్దు



ఖమ్మం, ఏప్రిల్ 21( వాయిస్ టుడే): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు మార్కెట్లలో పడిగాపులు కాస్తున్నా, చేతికి వచ్చిన వరి పంట కళ్ల ముందే ఎండిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. మొక్కజొన్న కొనుగోళ్లలో ఎలాంటి షరతులు లేకుండా ప్రతి గింజనూ సేకరించాలని, ఎండిపోతున్న వరి పొలాలను కాపాడేందుకు తక్షణమే నాగార్జున సాగర్ జలాలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన రైతాంగ సమస్యలపై ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు, సాగర్ ఆయకట్టు వరి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.పెట్టుబడులు పెరిగి, ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చినా మార్కెట్‌లో సరైన మద్దతు ధర లేక రైతులు కుమిలిపోతున్నారని కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ మొక్కజొన్న ధర కేవలం రూ. 1700 నుంచి రూ. 1800 వరకు మాత్రమే పలుకుతోందని, ఇది కనీస పెట్టుబడి కూడా రాని దుస్థితిని రైతులకు కల్పిస్తోందని గుర్తుచేశారు. ఇంత కష్టపడి నాణ్యమైన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువస్తే, మార్క్‌ఫెడ్ అధికారులు ఫంగస్ మరియు సన్నాల పేరుతో కొర్రీలు పెడుతూ కొనుగోళ్లు నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో పంట నాణ్యత బాగానే ఉన్నప్పటికీ, అధికారులు కావాలనే కాలయాపన చేస్తూ రైతులను వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ప్రారంభంలోనూ విపరీతమైన జాప్యం జరగడంతో, రైతులు తమ పంటను కాపాడుకోలేక తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన అగత్యం ఏర్పడిందన్నారు.



## ధర్మారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన విప్,ఆది శ్రీనివాస్

**రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుంది: విప్ ఆది శ్రీనివాస్**

కొనరావుపేట (ధర్మారం), ఏప్రిల్ 21(వాయిస్ టుడే): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం తూకం వేసే ప్రక్రియను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

### దళారులను నమ్మి మోసపోవద్దు

"రైతులు ఆత్రుత పడి తమ ధాన్యాన్ని తక్కువ ధరకే దళారులకు అమ్మి నష్టపోవద్దు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో ధాన్యాన్ని సేకరిస్తోంది. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకే తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి" అని విప్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం తూకం వేసిన వెంటనే రవాణా ప్రక్రియ (ట్రాన్స్‌పోర్ట్) వేగవంతం చేయాలి. రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టి, తాలు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి కేంద్రాలకు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, సొసైటీ చైర్మన్లు, రైతులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## వైభవంగా రేణుక జమదగ్ని కళ్యాణ మహోత్సవం

**ముఖ్య అతిథిగా హాజరైన చందుర్తి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు**

కోనరావుపేట, ఏప్రిల్ 21,వాయిస్ టుడే: కోనరావుపేట మండల కేంద్రంలో శ్రీ రేణుక జమదగ్ని కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి చందుర్తి రూరల్ సీఐ జి. వెంకటేశ్వర్లు గారు ప్రత్యేక అతిథిగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాంతియుత వాతావరణంలో సీఐ పూజా కార్యక్రమాల అనంతరం సీఐ వెంకటేశ్వర్లు గౌడ కుల సంఘ నాయకులతో మాట్లాడారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "బోనాల ఊరేగింపు సమయంలో యువత, భక్తులు క్రమశిక్షణతో ఉండాలి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గౌడ కుల సంఘ నాయకులు అప్రమత్తంగా ఉండి పోలీసు యంత్రాంగానికి సహకరించాలి."

### అలరించిన జానపద కళలు

కళ్యాణ మహోత్సవంలో భాగంగా బైండ్ల, పంబాల, పోచమ్మల పూజారులు ప్రదర్శించిన ఆటపాటలు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉన్న వారి కళా ప్రదర్శనలను సీఐ ఆసక్తిగా వీక్షించి, కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మండల కేంద్రమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.



## ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులను సన్మానించిన జిల్లా కలెక్టర్ అనుదీప్

ఖమ్మం, ఏప్రిల్ 21 (వాయిస్టుడే): ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థు లను అభినందిస్తూ, వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, కష్టపడి పని చేస్తే ఎంతటి విజయమైనా సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ తన చిన్నతనంలో తనకు ప్రత్యేకమైన కలలు లేదా ఆత్మవిశ్వాసం లేవని, అయితే ఇంటర్ ఫలితాలు తనలో నమ్మకాన్ని పెంచాయని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించగలమనే విశ్వాసం అప్పుడు కలిగిందని చెప్పారు. ప్రస్తుతం మంచి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థిలో ప్రతిభ, మేధస్సు ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇప్పటితోనే ఆగకుండా ఇంకా ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, మంచి కళాశాలలో సీటు పొందేందుకు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని తెలిపారు. మంచి విద్యా సంస్థల్లో చదవడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు, జీవన శైలీలు తెలుసుకునే అవకాశం ఉంటుందని, ఎప్పుడూ తక్కువగా భావించకూడదని సూచించారు. కష్టపడి పనిచేస్తూ, మనపై మనం నమ్మకం ఉంచితే ఏ లక్ష్యమైనా సాధ్యమని పేర్కొన్నారు. జీవితంలో అవకాశాలు ఎప్పుడూ ఉంటాయని, ఒక అవకాశం కోల్పోయినా మరో అవకాశం వస్తుందని, విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో పట్టుదలగా ఉండాలని సూచించారు. అడ్డంకులు, వైఫల్యాలను పాఠాలుగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు.ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల విద్యను నేర్చుకోవడం సులభమైందని, సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్‌ను సానుకూలంగా వినియోగిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, ప్రపంచంలో జరుగుతున్న మార్పులను నిరంతరం తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు.విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, ప్రతి నెల ఒక కొత్త పుస్తకం చదివే లక్ష్యాన్ని పెట్టుకోవాలని సూచించారు. చదివిన విషయాలను రాసుకునే అలవాటు పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా లివిద్యార్థులు మాట్లాడుతూలి కాలేజీల్లో నిర్వహించిన ప్రత్యేక తరగతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంలో ఎంతో సహాయ పడ్డాయని తెలిపారు. ఆ తరగతుల వల్లే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించ గలిగామని పేర్కొన్నారు. అలాగే, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగం, లెక్చరర్లకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రభుత్వ విద్యార్థినీ, విద్యార్థులను ఘనంగా సన్మానించారు.




## ఖమ్మంలో గుజరాతి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 21 (వాయిస్ టుడే) : ఖమ్మంలో గుజరాతి కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి మంత్రి తుమ్మల నాగేశ్వరావు విచ్చేసి కమ్యూనిటీ హాల్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సంఘం యొక్క ప్రాముఖ్యత మరియు వీరి యొక్క జీవనశైలి గురించి మాట్లాడారు. ఖమ్మం నగరం లో వివిధ రకాల వ్యాపారాలు చాలా కష్టపడి చేశారు. ఇప్పటికీ ఈ సంఘ ప్రజలు ఉమ్మడి కుటుంబాలుగా ఉండటానికి ఇష్టపడతారు మరియు ఇంటి పెద్ద చెప్పిన మాట జవదాటరు , మహిళలు కూడా ఇంటి కార్యకలాపాలు చూసుకుంటూ తమ చిన్న పిల్లలకు మంచి సంస్కారం నైతిక విలువలను నేర్పిస్తారు ఇది వారిని భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుందని తెలిపారు.ఖమ్మంలో అనేక ప్రాంతాలలో రోడ్ల విస్తీర్ణం ద్వారా అభివృద్ధి జరుగుతుందని ఏ ప్రాంతమైన స్థానిక ప్రజల అభీష్టం మేరకు రోడ్ల విస్తీర్ణ చేపడతానని తెలియజేశారు. ఈ రెండున్నర సంవత్సరాలలో అనేక ప్రాంతాల్లో రోడ్ల విస్తీర్ణ పనులు జరిగాయని రానున్న ఐదు సంవత్సరాలలో మరొకమారు ప్రజల కోరిక మేరకు, వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రశాంతమైనటువంటి స్వచ్ఛమైన ఖమ్మం దిశగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు. ఈ త్రీ టౌన్ ప్రాంతంలో సుందరీకరమైన కేబుల్ బ్రిడ్జి, అధునాతన వ్యవసాయ మార్కెట్, అదేవిధంగా ఖమ్మంలో ఖిల్లా పై రోపువే ఏర్పాటు చేయటం లాంటి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ వ్యక్తిని బెదిరించడం గాని, బలవంతంగా గాని రోడ్డు విస్తరణ పనులు చేయలేదని స్థానిక ప్రజల అభిప్రాయం మేరకే అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. ఈ ఈ యొక్క కమ్యూనిటీ హాల్ మా సమాజ ప్రజలకే కాకుండా అందరికీ ఉపయోగపడుతుందని అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు , ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ , ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గా ప్రసాద్ , ఖమ్మం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి , ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పాడిబండ్ల యుగంధర్ , ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు , వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ , స్థానిక కార్పొరేటర్ యర్ర గోపి ,గుజరాతి సమాజ్ తరఫున ఛగన్ పటేల్, దినేష్ పటేల్ మొదలైన వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**

# కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్

## ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 'భూభారతి' అమలుకు మంత్రి పొంగులేటి అంకురార్పణ



ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 21 ( వాయిస్ టుడే): తెలంగాణ రెవెన్యూ చరిత్రలో మంగళవారం ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న భూ తగాదాలకు చరమగీతం పాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్వే మ్యాప్ ఆధారిత రిజిస్ట్రేషన్' ప్రక్రియ పట్టాలెక్కింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కుసుమంచి మండలం నుంచి ఈ విప్లవాత్మక మార్పుకు అంకురార్పణ చేశారు. రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని, ఆ హక్కుకు సర్వే మ్యాప్ మరియు భూధార్‌తో రక్షణ కల్పించినప్పుడే రైతు కుటుంబానికి భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

గతంలో రిజిస్ట్రేషన్ అంటే కేవలం కాగితాల మీద రాసుకునే దస్తావేజులు మాత్రమే ఉండేవి. దీనివల్ల సరిహద్దు వివాదాలు తలెత్తి రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ 'భూభారతి' చట్టం ద్వారా రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమికి సంబంధించిన స్పష్టమైన సర్వే మ్యాప్ (ఎల్ పి ఎం) ఉండటాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా కూసుమంచి మండలం గట్టు సింగారం గ్రామంలోని సర్వే నంబర్ 156/ఇ/1 లో గల ఒక ఎకరా నాలుగు గుంటల భూమికి సంబంధించి రాష్ట్రంలోనే తొలి 'మ్యాప్ ఆధారిత' రిజిస్ట్రేషన్ జరిగింది. నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామానికి చెందిన రైతు భాగం కిషన్ రావు తన భూమిని, అదే గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావుకు విక్రయించగా.. తహసీల్దార్ కార్యాలయంలో భూమి హద్దులతో కూడిన మ్యాప్‌ను జతచేసి ప్రక్రియను పూర్తి చేశారు. దీనివల్ల భవిష్యత్తులో పొరుగు రైతులతో వచ్చే సరిహద్దు తగాదాలకు ఇకపై తావుండదు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టే, ఇకపై ప్రతి భూకమతానికి ఒక విశిష్టమైన 'భూధార్' నెంబర్‌ను ప్రభుత్వం కేటాయిస్తోంది. కూసుమంచిలో జరిగిన ఈ చారిత్రక రిజిస్ట్రేషన్‌కు భూధార్ సంఖ్యను (భూ కమత పటము-1) కేటాయించారు. దీనివల్ల భూమి యజమాని వివరాలు, విస్తీర్ణంపై ఎలాంటి సందేహాలకు తావుండదు. యాజమాన్య హక్కులను శాశ్వతంగా నిర్ధారించడమే కాకుండా, ఎవరైనా స్వచ్ఛందంగా తమ ఆస్తుల సర్వే సర్టిఫికేట్ పొందాలనుకుంటే కూడా దరఖాస్తు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. ఈ విధానం ద్వారా భూ వ్యవహారాల్లో పూర్తిస్థాయి పారదర్శకత వస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంతో పాటు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో ఈ కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. పాతకాలపు గొలుసు సర్వేలకు స్వస్తి పలికి, అత్యాధునిక 'రోవర్ల' సహాయంతో కచ్చితమైన కొలతలు తీస్తున్నారు. ఈ వినూత్న విధానం త్వరలోనే దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలవనుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## పొన్నం వివాహ వార్షికోత్సవ వేడుకలు

### కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌కు ఘన సన్మానం



కరీంనగర్,ఏప్రిల్ 21(వాయిస్ టుడే):రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వివాహ వర్సికోత్సవం సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియంతుడైన కొత్తపల్లి మండల వార్డు మెంబర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దుర్గం అంజయ్యను 21 డివిజన్ వరాల నరసింహం ఆధ్వర్యంలో 20 డివిజన్ పర్వతం మల్లేశం,16 వ డివిజన్ జగన్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం వివాహ వర్సికోత్సవం వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బోనాల శ్రీనివాస్,ఐల రామ్మోహన్,దశరథం కనక చారి,గంగారెడ్డి అనంతరెడ్డి, సిద్ధమల్లేశం,పెరిక రాజేందర్,పెరుక వెంకట్, రాములు,కత్తి శంకర్,వీరారెడ్డి,అక్క పెల్లి మల్లేశం,కాంపల్లి బాబు,రాగడి శ్రీనివాస్, అమృతలాల్, కొండ రవీందర్,రమేష్,పోరెడ్డి నరేందర్, నారాయణరెడ్డి, ఆచారి మధుసూదన్,రవీంద్రచారి,వీరయ్య, తిరుపతి,నారాయణ,రామస్వామి, పరశురాం పాల్గొన్నారు.

## పిట్లంలో జనగణన-2027 శిక్షణ తరగతులు ముగింపు

వాయిస్ టుడే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 21: జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో జనగణన విధానం, డేటా సేకరణ పద్ధతులు, ఇంటింటి సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు ఈరోజుతో విజయవంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు. జనగణన ప్రక్రియను సక్రమంగా అమలు చేసేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని పాల్గొన్న సిబ్బంది పేర్కొన్నారు.




## వివేకానంద కళాశాలలో చలివేంద్రం ఏర్పాటు

కరీంనగర్,ఏప్రిల్ 21(వాయిస్ టుడే): స్థానిక వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాల. పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా బాటసారులు మరియు విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. హెచ్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండల దృష్ట్యా సామాజిక బాధ్యతగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని విద్యార్థులు కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలలో పాల్గొని,చలివేంద్రం ద్వారా స్వచ్ఛమైన మరియు చల్లని తాగునీటి ఉచితంగా అందజేస్తున్నట్లు ప్రిన్సిపల్ సి. హెచ్ శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎసివో బి.సంపత్ కుమార్ ,ఎ.వో బి.శ్రవణ్ కుమార్,బి.రామేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్,బైరం మహేష్, నాంపల్లి శ్రీనివాస్ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## హనుమాన్ దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ

### పాల్గొన్న రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు

కరీంనగర్,ఏప్రిల్ 21(వాయిస్ టుడే): నగరంలోని ప్రశాంత్ నగర్ కాలనీలో వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షలో ఉన్న స్వాములకు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి మరియు కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీక్షా స్వాములకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో సునీల్ రావు,అంజన్ కుమార్ (26వ డివిజన్ కార్పొరేటర్)సరిల్ల ప్రసాద్ (మాజీ కార్పొరేటర్)శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి సేవా సమితి సభ్యులు,కాలనీ వాసులు మరియు పెద్ద సంఖ్యలో హనుమాన్ దీక్షా స్వాములు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ స్థానం కోసం రేవంత్ రెడ్డి తాపత్రయం

**దక్షిణాదికి అన్యాయమంటూ గగ్గోలు వెనుక అసలు కుట్ర ఇదే**

**జమిలి ఎన్నికలొస్తే బీజేపీ గెలుస్తుందనే భయం రేవంత్‌కు పట్టుకుంది**

**వాళ్లకు పదవులిస్తే మహిళలకు న్యాయం జరిగినట్లేనని భావిస్తున్నారు**

**సాధారణ మహిళలు చట్టసభల్లోకి వస్తే కుటుంబ పార్టీల పునాదులు కదిలిపోతాయనే భయం పట్టుకుంది**

**గంట సేపు టైమిస్తే డీలిమిటేషన్ బిల్లును పెట్టి దక్షిణాదికి న్యాయం చేస్తామని అమిత్ షా చెప్పారు**

**తెలంగాణ బిల్లును పార్లమెంట్ లో కాంగ్రెస్ ఎంపీలు అడ్డుకుంటే అడ్డుకున్నది బీజేపీయే**

**బీఆర్ఎస్ తో బీజేపీ పొత్తు కల్ల**

**బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుని అధికారం పంచుకున్న చరిత్ర కాంగ్రెస్ దే**

**రేవంత్ రెడ్డి, స్టాలిన్ లపై మండిపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్**



కరీంనగర్, ఏప్రిల్ 21(వాయిస్ టుడే): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్థానాన్ని ఆక్రమించాలని తాపత్రయపడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. అందులో బాగంగానే డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని గగ్గోలు పెడుతున్నారని అన్నారు. జమిలి ఎన్నికలొస్తే తెలంగాణలోనూ బీజేపీ విజయం తథ్యమని రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందన్నారు. కరీంనగర్ లో మీడియాతో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుపై బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి,స్టాలిన్ లపై మండిపడ్డారు. డీలిమిటేషన్,మహిళా రిజర్వేషన్ బిల్లులను అడ్డుకుని ఏదో గొప్ప పని చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రజలంతా రేవంత్ ను చీదరించుకుంటున్నారనే సంగతి మర్చిపోయారు. కనీసం ఇంటెలిజెన్స్ నుండి సమాచారం తెప్పించుకుంటే బాగుండేది. ఇవేవీ లేకుండా రాహుల్ గాంధీ స్థానంలో రేవంత్ రెడ్డి కూర్చోవాలని తాపత్రయపడుతున్నారు. ఎందుకంటే రాహుల్ గాంధీని ప్రజలు లీడర్‌గా అంగీకరించడం లేదు. ఆ స్థానంలోకి రావాలని తహతహ లాడుతున్నారు. మహిళా బిల్లును అడ్డుకుని రేవంత్ రెడ్డి,స్టాలిన్ సహా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయి. కాంగ్రెస్,ఎస్పీ,డీఎంకే, ఎన్సీపీ పార్టీల దృష్టిలో మహిళలంటే సోనియా,ప్రియాంకగాంధీ,డింపుల్ యాదవ్, కనిమొళి, సుప్రియా సూలే మాత్రమే. వాళ్లకు పదవులు,సీట్లు ఇస్తే మహిళలందరికీ న్యాయం జరిగినట్లేనని అనుకుంటున్నారు. అందుకే సాధారణ మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తానంటే అడ్డుకోవడం లేదు. ఎందుకంటే సాధారణ మహిళలకు చట్టసభల్లోకి వస్తే వారసత్వ కుటుంబ పార్టీల పునాదులు కదిలిపోతాయనే భయం పట్టుకుంది. అందుకే అడుగడుగునా అడ్డుకుంటున్నారు. దేశంలో 52 కోట్ల జనాభా ఉన్నప్పుడు 543 పార్లమెంట్ సీట్లు ఉండాలని నిర్ణయించారు. నేటికీ అదే కొనసాగుతోంది. దేశ జనాబా 140 కోట్లు దాటిన నేపథ్యంలో ఎంపీ సీట్ల సంఖ్యను 816 ఎంపీ సీట్లు చేయాలని మోదీ నిర్ణయించారు. జనాభా లెక్కలతో సీట్లు కేటాయిస్తే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని మోదీ గ్రహించి ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచి ఏ రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని బిల్లును పెట్టారు. దీంతోపాటు అస్తవ్యస్తంగా ఉన్న పార్లమెంట్,అసెంబ్లీ నియోజకవర్గాలకు క్రమబద్దీకరించాలని నిర్ణయించి పార్లమెంట్ లో డీలిమిటేషన్ బిల్లు పెడితే అడ్డుకుని రేవంత్, స్టాలిన్ సహా కుటుంబ పార్టీలు దక్షిణాదికి తీరని అన్యాయం చేశారు. పార్లమెంట్ లో గంట సేపు సమయమిస్తే ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతూ డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెడతామని అమిత్ షా చెప్పారు. తద్వారా దక్షిణాదికి న్యాయం చేస్తామని చెబితే అడ్డుకున్నది ఎవరు కాంగ్రెస్,డీఎంకే, ఎస్పీ,టీఎంసీ,ఎన్సీపీ పార్టీలే కదా అన్నారు.



## బోయినపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

### గ్రామాల్లో సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

బోయినపల్లి, ఏప్రిల్ 21 బోయినపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు,రికార్డులను సమగ్రంగా పరిశీలించి,కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా,పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి,చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లపై,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను కఠినతరం చేయాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ సమగ్ర భద్రతను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తెలియని కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, వాహనదారులుకు హెల్మెట్ , సిట్‌బెల్ట్ వినియోగం,మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలు,మైనర్ డ్రైవింగ్ లపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను, వ్యాపారస్తులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. స్టేషన్ పరిధిలో గంజాయి,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు,సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.



## కరీంనగర్ కరీంనగర్ పాల డైరీ నిర్వాహకుల మోసం

### పాలు పారబోసి నిరసన తెలిపిన పాడి రైతులు

బోయినపల్లి ఏప్రిల్ 21 (వాయిస్ టుడే) : కరీంనగర్ డైరీ నిర్వాహకులు పాడిరైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ పాలు కింద పోసి నిరసన తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన పాల కేంద్రంలో గ్రామంలోని దాదాపు 70 మంది పాడి రైతులు ఉదయం సాయంత్రం పాలను కేంద్రంలోకి తీసుకెళ్లి విక్రయిస్తుండగా గత కొన్ని నెలల క్రితం నుండి వెన్న శాతం తక్కువ వస్తుందని చెప్తూ తక్కువ ధర చెల్లించడం తో పై అధికారులకు పిర్యాదు చేయగా పాల సేకరణ యంత్రం మరమ్మత్తు చేయించి ఇక నుండి సమస్య రాదు అని చెప్పగా కేవలం నాలుగు రోజులు మాత్రమే పాలను తీసుకొని సరైన డబ్బులు చెల్లించారని మళ్ళీ రెండు రోజుల నుండి మళ్ళీ వెన్న శాతం రావడం లేదని డబ్బులు తక్కువ ఇవ్వడం తో ఆగ్రహం చెందిన పాడి రైతులు పాల కేంద్రం వద్ద నిరసన తెలిపి పాలను పారబోసి రైతులను మోసం చేస్తున్న కరీంనగర్ డైరీ పై చర్యలు తీసుకోవాలని కోరారు.కాగా అక్కడికి వచ్చిన సూపర్ వైజర్ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళతాని చెప్పారు



## గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

### ప్రారంభించిన సర్పంచ్ నల్ల మోహన్

బోయినపల్లి ఏప్రిల్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ నల్ల మోహన్ వార్డు సభ్యులతో కలిసి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండాకాలం కావడం తో ప్రజల దాహార్తి తీర్చేందుకు బస్టాండ్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ పనులకోసం మండల కేంద్రానికి వచ్చే వారికి, ప్రయాణికులకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని అన్నారు. అనంతరం గ్రామంలో వేసవిలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలోని రైతుల బావులనుండి మీరు తీసుకొని గ్రామంలో సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా పలు భావులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు బొజ్జ నరేందర్, దూస శ్రీనివాస్, నాయకులు మెరుపుల జలంధర్, మెరుపుల గంగాధర్, వాసల శ్రీనివాస్,బొడ్డు తిరుపతి, భీమనాథ రమేష్, తదితరులు ఉన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**